తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
31 జూలై 2026
పేజీలు : 8
Follow :

# పరవళ్లు తొక్కుతున్న గోదావరి..!

## రైతన్నల ఆశలు సజీవం

**మంథని, జులై 30,( జనంసాక్షి):**
ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలుగా సరైన వర్షాలు లేక, సుదీర్ఘ నిరీక్షణ తర్వాత గోదావరి తల్లి మళ్లీ రూపుమార్చుకుంది. నిన్న, మొన్నటి వరకు నీళ్లు లేక ఎడారిలా వెలవెలబోయిన గోదావరి తీరం, ఇప్పుడు తుఫాన్ ప్రభావం కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ధాటికి నిండుకుండ లా మారడంతో మంథని ప్రాంతమంతా పండగ వాతావరణం సంతరించుకుంది. పరవళ్లు తొక్కుతున్న ప్రకృతి సోయగంతో రైతులు, ప్రజలు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ఎగువన పడుతున్న వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి అందాలు చూసేందుకు స్థానికులు నదీ తీరానికి క్యూ కడుతున్నారు. అలల సవ్వడులు, ఉరకలేస్తున్న వరద నీటితో నదీ తీరం కనువిందు చేస్తోంది. నదికి మళ్లీ పూర్వవైభవం రావడంతో ప్రకృతి ప్రేమికులు, మంథని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ఈ ప్రాంత వ్యవసాయ రంగానికి పెద్ద ఊరట లభించింది. నీటి కొరత తీరడంతో వరితో పాటు ఇతర పంటలు సమృద్ధిగా పండుతాయని రైతన్నలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నిండుగా ప్రవహిస్తుండటంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి, రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తప్పుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకం
- చెరువులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలి
- ముంపుకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలి
- జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి,జూలై 30(జనంసాక్షి) : గత 48 గంటలుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని లిరాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులి అధికారులను ఆదేశించారు. గురువారం లిప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణా రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ లతో కలిసి భారీ వర్షాల పరిస్థితిపై జిల్లా అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఒక్క చెరువు కూడా గండి పడకుండా లేదా తెగిపోకుండా సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా సాగునీటి శాఖ అధికారి ఆధ్వర్యంలో లస్కర్లు, సహాయ ఇంజినీర్లు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) చెరువులను పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో కలిసి నిరంతరం పరిశీలించాలని సూచించారు. చెరువుల్లో గండ్లు, నీటి పొంగిపొర్లడం లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి అత్యవసర నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీట మునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను వెంటనే రాకపోకలకు మూసివేయాలని, అలాంటి ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు, పోలీసు సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వర్షాల వల్ల దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లను వెంటనే గుర్తించి **మిగతా 2లో**

# నీటి ఉధృతి పెరుగుతున్న వేళ..

## గోదావరి తీరాలకు వెళ్లవద్దని పోలీసుల విజ్ఞప్తి

### ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నేపథ్యంలో..

### ఎల్లంపల్లి ప్రాజెక్టు,గోదావరి ఘాట్‌ను పరిశీలించిన ఏసీపీ రమేష్..



**గోదావరిఖని, జనంసాక్షి :**
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ కృష్ణకుమార్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డితో కలిసి ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి,ప్రస్తుతం నీటి ప్రవాహ పరిస్థితులు,ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటి పరిమాణం తదితర వివరాలను పరిశీలించారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాలకు 4 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నందున,దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సమ్మక్క దేవాలయం సమీపంలోని గోదావరి వంతెన వద్ద ఉన్న గోదావరి ఘాట్‌ను సందర్శించి,ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నదిలోకి విడుదలవుతున్న నీటి ప్రవాహ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పరివాహక ప్రాంతంలోని గ్రామాల ప్రజలు, మత్స్యకారులు, నదీతీర ప్రాంతాలకు వెళ్లేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అవసరం లేకుండా నదిలోకి దిగడం, చేపల వేటకు వెళ్లడం, సెల్ఫీలు తీసుకునేందుకు నది ఒడ్డుకు చేరుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, అంతర్గాం ఎస్ఐ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### అత్యవసర సేవల కోసం ఫోన్ చేయండి: తాళ్లపల్లి మనోజ్ గౌడ్

సుల్తానాబాద్,జూలై 30(జనంసాక్షి) : భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సేవల కోసం ఫోన్ చేస్తే తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ సిద్ధంగా ఉందని తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ స్పష్టం చేశారు. భారీ వరదల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

### పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో ఏర్పాటు

- దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

వార్తా లోపలి పేజీలో

### భారీ వర్షాలపై హై అలర్ట్..

అధికారులకు సెలవులు రద్దు ?

కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు 7లో

## భారీ వర్షాల నేపథ్యంలో

# అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసర మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం వంటి ఘటనలను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిహార ప్రతిపాదనలు సిద్ధం చేసి ట్రెజరీకి పంపించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్లు తదితర స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. నీట మునిగిన ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి, అక్కడ ఆహారం, తాగునీరు, వసతి, తదితర అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అలాగే శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లను వెంటనే గుర్తించి వాటిలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) అధికారులు విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు, సరిహద్దు మండలాలు, గ్రామాల్లో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని, చేపల వేట, పశువులను మేపడం లేదా ఇతర ప్రమాదకర కార్యకలాపాల కోసం ఎవరూ నదిలోకి వెళ్లకుండా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న లేదా రాకపోకలకు అంతరాయం కలిగిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఏవైనా అత్యవసర సంఘటనలు జరిగిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలికలెక్టర్ కోయ శ్రీహర్ష..

**- ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరద నీరు చేరకుండా ఆర్ఎఫ్‌సీఎల్ తక్షణ చర్యలు చేపట్టాలి..**

**- ఓసీ-3 ప్రాంతంలో యంత్రాలతో నీటిని వేగంగా తొలగించాలి..**

**- భారీ వరద ప్రవాహాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి..**

**- ప్రజలను అప్రమత్తం చేయాలి..**

**- ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్..**

**గోదావరిఖని, జనంసాక్షి:**



రామగుండం మున్సిపల్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం రామగుండం మున్సిపల్ పరిధిలోని 21వ డివిజన్ వీర్లపల్లి, ఓ.సి.పి- 3 ఏరియా, 25వ డివిజన్ వరద ప్రభావిత ప్రాంతాలను రామగుండం శాసనసభ్యులు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్ రామగుండం అరుణశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద పరిస్థితులను, నీటి నిల్వను, ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆర్అండ్ఆర్ కాలనీలో వరదల సమయంలో నీరు ఇళ్లలోకి ప్రవేశించకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను రూపొందించాలని ఆదేశించారు. ఓసీ-3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైనచోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌లాల్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్..

**- పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు కోరుకంటి చందర్..**

గోదావరిఖని, జనంసాక్షి:

మంథని మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక నాయకుడు తగరం శంకర్‌లాల్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన తీవ్రమైన నేరారోపణ కేసులో ఆయన అరెస్టు అయిన నేపథ్యంలో, పార్టీ క్రమశిక్షణ నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, పార్టీ క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్టు జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ వెల్లడించారు.



# కొరడా ఝుళిపించిన సింగరేణి..

**- తిలక్‌నగర్ చౌరస్తాలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత..**

గోదావరిఖని, జనంసాక్షి:

సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధి తిలక్‌నగర్ చౌరస్తా పరిసర ప్రాంతంలో సింగరేణి భూమిలో జరుగుతున్న అక్రమ ప్రైవేట్ నిర్మాణాలను సింగరేణి స్పెషల్ స్క్వాడ్ బృందం పర్యవేక్షణలో గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సింగరేణి భూముల్లో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు (ప్రైవేట్ నిర్మాణాలు) చేపట్టడం చట్టవిరుద్ధమని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా సింగరేణి భూమిలో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్మాణాలను వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. అధికారుల చర్యను స్థానికులు, అన్ని వర్గాల ప్రజలు స్వాగతించారు. ప్రభుత్వ, సింగరేణి భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగించాలని ప్రజలు కోరారు.

# షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేతను పరిశీలించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్..

గోదావరిఖని, జనంసాక్షి:

స్థానిక తిలక్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను సింగరేణి అధికారులు కూల్చివేసిన విషయం తెలుసుకున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ గురువారం ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా కూల్చివేతకు గల కారణాలను సింగరేణి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజ్‌ఠాకూర్ వెంట నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఏసీపీ, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి అధికారులున్నారు.





# ఏఐ..మెషిన్ లెర్నింగ్‌లో ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ద్వారా అప్లికేషన్‌లో..

**- ఖచ్చితత్వాన్ని సాధించవచ్చు..**

**- అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమ..**

**గోదావరిఖని, జనంసాక్షి:**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐ..మెషిన్ లెర్నింగ్‌లో ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ద్వారా అప్లికేషన్‌లో ఖచ్చితత్వాన్ని సాధించవచ్చని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రమ అన్నారు. పైథాన్‌పై నిర్వహిస్తున్న మూడు రోజుల వర్క్‌షాపులో భాగంగా చివరి రోజు వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టర్ రమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సును, నాలెడ్జ్‌ని అనుసంధానం చేసుకుంటూ మెషిన్ లెర్నింగ్ నేర్చుకోవాలన్నారు. ఏదైనా అప్లికేషన్‌ను తయారుచేసే క్రమంలో ఖచ్చితత్వం కోసం వివిధ రకాల మోడల్ లెర్నింగ్స్ రూపొందించి సమగ్ర సమాచారాన్ని పొందుపరచాలన్నారు. దీని కోసం ప్రాంప్ట్ ఇంజనీరింగ్ నేర్చుకోవాలన్నారు. ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో నిష్ణాతులైన వారు కోడింగ్ ద్వారా పైథాన్‌లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు వర్క్‌షాప్‌లు, సెమినార్లలో పాల్గొనడంతోనే సరిపెట్టకుండా తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనాలని సూచించారు. ప్రతి సంవత్సరం నీట్, ఐఐటీ వంటి ప్రీమియర్ ఇనిస్టిట్యూషన్ ఆఫర్ చేసే ఇంటర్షిప్‌లో ఖచ్చితంగా పాల్గొని మెషిన్ లెర్నింగ్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలి ఆకాంక్షించారు. బీఎస్ఎన్ఎల్ లాంటి సంస్థలు ఆన్‌లైన్‌లో పెయిడ్ ఇంటర్న్‌షిప్‌ను కూడా అందిస్తున్నాయన్నారు.

రెండవ రోజు వర్క్ షాప్‌లో హెచ్‌బీఐసీ సొల్యూషన్స్ ఫౌండర్, సీఈఓ పల్లెల కమలాకర్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇండస్ట్రీకి అవసరమైన సాంకేతిక అంశాలను హ్యాండ్స్ ఆన్ ప్రాక్టీస్ ద్వారా విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించారు. ఆయన మాట్లాడుతూ గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు, మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు హెచ్‌బీఐసీ సొల్యూషన్స్ ఇంటర్న్‌షిప్, ప్లేస్మెంట్స్‌లో సపోర్ట్ చేస్తుందని చెప్పారు. మూడురోజుల ఈ వర్క్‌షాప్‌లో సుల్తానాబాద్ మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 30 మంది, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 30 మంది కలిసి అరవైమంది, అధ్యాపకులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌కు, ముఖ్యఅతిథికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝూ, వైస్ ప్రిన్సిపల్ ఏ.సాంబశివరావు, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్, లెఫ్టినెంట్ బి.తిరుపతి, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్స్ డాక్టర్ వి.నరేష్, డాక్టర్ ఏ.స్రవంతి ధన్యవాదాలు తెలిపారు.

# అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు..

**- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..**

**గోదావరిఖని, జనంసాక్షి:**



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎద్దపల్లి, మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని కమిషనరేట్ పరిధిలోని డ్యామ్‌లు, పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ఎవరూ అక్కడికి వెళ్లరాదని సూచించారు.

## ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణంతో చెరువులుగా మారిన పంటపొలాలు

- పంటలను పరిశీలించిన సర్పంచ్ అత్తే చంద్రమౌళి
- రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- లేదంటే నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరిక



**ముత్తారం, జూలై 30(జనంసాక్షి):** పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామ శివారులో జాతీయ రహదారి (ఎన్‌హెచ్) నిర్మాణ పనుల కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షపు నీరు పంటపొలాల్లోకి చేరి చెరువులను తలపించే పరిస్థితి ఏర్పడిందని గ్రామ సర్పంచ్ అత్తే చంద్రమౌళి ఆరోపించారు.గురువారం ఆయన బాధిత రైతులతో కలిసి నీట మునిగిన పంటపొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,వర్షపు నీరు వెళ్లే మార్గాలను నిర్మాణ పనుల్లో మూసివేయడం వల్ల వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని తెలిపారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు,నిర్మాణ కాంట్రాక్టర్ల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు.పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి బాధిత రైతులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతులతో కలిసి ఎన్‌హెచ్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని సర్పంచ్ అత్తే చంద్రమౌళి హెచ్చరించారు.అధికారులు తక్షణమే స్పందించి వర్షపు నీరు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

## రూ.180 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్‌పై విచారణ జరపాలి



కరీంనగర్ టౌన్, జూలై 30, ( జనం సాక్షి)కరీంనగర్ నగరంలో రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల టెండర్ ప్రక్రియపై మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పలు ఆరోపణలు చేశారు. టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ, దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎక్సెస్ టెండర్‌ను రద్దు చేసి తిరిగి అదే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు.గతంలో స్మార్ట్ సిటీ కింద చేపట్టిన డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులపై కూడా సమీక్ష జరపాలని ఆయన డిమాండ్ చేశారు. నగరంలోని ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు, డ్రైనేజీ లింకులు, ఇంటి కనెక్షన్లు, ఇప్పటికే ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పనితీరుపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు ప్రజల అవసరాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో అమలు కావాలని, టెండర్ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ప్రభుత్వం భావిస్తే అన్ని వివరాలను బహిర్గతం చేయాలని ఆయన అన్నారు. అవసరమైతే ప్రజల తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు.

## వరద సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం




**మంథని, జులై 30, (జనంసాక్షి ):** పెద్దపల్లి జిల్లాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పలు కాలనీలు జలమయమైన నేపథ్యంలో సహాయక, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సింగరేణి సీఎండీ, ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో సీఎండీ, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) అధికారులు, రామగుండం పోలీసు కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వెంకటరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామికవాడలో నిలిచిపోయిన వరద నీరు తొలగించేందుకు నాలాల్లో ఉన్న ఆటంకాలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. వరద సహాయక చర్యల్లో సింగరేణి, ఎన్‌టీపీసీ అధికారులు చురుకుగా పాల్గొని జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. వీర్లపల్లి గ్రామంలోకి నివాస ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో గ్రామంలోకి వరద నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా ఇంటి స్థలాల పట్టాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పెద్దపల్లి కలెక్టర్‌కు సూచించారు. గోదావరిఖనిలో వరద తీవ్రత అధికంగా ఉన్నందున మున్సిపల్, రెవెన్యూ శాఖలకు పోలీసులు పూర్తి సహకారం అందించాలని రామగుండం పోలీసు కమిషనర్‌కు ఆదేశించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రామగుండంలో విపత్తు నివారణ బృందాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని 1,021 చెరువుల్లో దాదాపు 80 శాతం నిండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని సుమారు 2.7 లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండదన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు గురువారం సాయంత్రానికి 20 టీఎంసీలకు చేరనున్నాయని తెలిపారు. నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామంతో పాటు గోదావరిఖని, రామగుండం పారిశ్రామికవాడ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సింగరేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## భారీ వర్షాలకు ఉప్పొంగిన విలోచవరం వాగు



మంథని, జులై 30, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంథని మండలంలోని విలోచవరం వాగు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. వాగు ఉద్ధృతి ఒక్కసారిగా పెరగడంతో రహదారిపైకి భారీగా వరద నీరు చేరుకొని, మంథనికి వెళ్లే సాధారణ వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు ప్రవాహం పెరగడంతో విలోచవరం, దాని పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంథని పట్టణానికి చేరుకోవాలంటే స్థానికులు పోతారం,ఉప్పట్ల, గుంజపడుగు గ్రామాల మీదుగా సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణ దూరం, సమయం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉన్నందున, స్థానికులు లేదా వాహనదారులు ఎవరూ సాహసించి వాగును దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు స్పష్టం చేశారు. అత్యవసర సేవలు మినహా, ఇతర ప్రయాణాలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. వర్షాలు ఇంకా కొనసాగుతున్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, కాలువలు, పొంగిపొర్లుతున్న వాగుల వద్దకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందుకోవాల్సిన వారు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనుల కోసం వెళ్లే రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి విలోచవరం వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వృద్ధులకు వర్షం కవర్లు అందించిన కుర్ర ధరణ



**ముస్తాబాద్ జులై 30 (జనం సాక్షి)** ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో అన్నపూర్ణమ్మ ఫౌండేషన్ లోని వృద్ధులకు వర్షాల నేపథ్యంలో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. అని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కుర్ర సావిత్రి దేవయ్య దంపతుల కూతురు కుర్ర ధరణి 50 మంది వృద్ధులకు వర్షం కవర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూర ధరణి మాట్లాడుతూ అన్నపూర్ణ పౌండేషన్ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు ఇంత శ్రమను ఓర్చుకొని గ్రామంలో నిరుపేద వృద్ధులకు వికలాంగులకు ఒక పూట అన్నం పెట్టడం పెద్ద పుణ్యం దొరుకుతుంది. ఇలాంటి పుణ్యం ఎన్ని సేవలు చేసిన దొరకదు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ నిర్వాహకులు పాల్గొన్నారు.

## సేవ వైభవ రత్న అవార్డు గ్రహీత నల్మాసు ప్రభాకర్ కి ఘన సన్మానం



**మంథని, జులై 30, (జనంసాక్షి) :** లలిత కళాసమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "సేవ వైభవ రత్న" అవార్డుతో పాటు సువర్ణ కంకణం, బంగారు పతకం అందుకోనున్న సందర్భంగా, పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్ ను పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముస్త్యాల శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్త్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామాజిక సేవా రంగంలో నల్మాసు ప్రభాకర్ గారు చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక "సేవ వైభవ రత్న" అవార్డు, సువర్ణ కంకణం, బంగారు పతకం లభించడం జిల్లా ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య , మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బుద్దార్థి బుచ్చయ్య ,బర్ల శ్రీనివాస్, రామగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మోతుకూరి అవినాష్ గౌడ్, రావికంటి సతీష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వేచ్ఛ సమానత్వం సోదర భావనతో జీవించాలి




**గంగాధరజూలై30(జనంసాక్షి):**మనుషులందరూ స్వేచ్ఛ సమానత్వం సోదరభావం ప్రేమతో కలిసి మెలిసి జీవించాలని గంగాధర గిర్దావర్ సంతోష్ కుమార్ అన్నారు.గురువారం మండలంలోని గర్శకుర్తి గ్రామంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం కులవివక్షత ద్వేషం దౌర్జన్యం అనే భావాలను మనస్సు నుండి చెరిపి వేసి ప్రేమతో అందరూ సమానత్వమే అన్న స్ఫూర్తితో కలిసి మెలిసి జీవించాలని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు,అంబేద్కర్ సంఘము మండల అధ్యక్షుడు గంగాధర ప్రవీణ్,జిపిఓ చరణ్,హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, ఉపసర్పంచ్,వార్డ్ సభ్యులు,మరియు అంబేద్కర్ సంఘము, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వరద సహాయక చర్యలు ముమ్మరం. మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

## - కమిషనర్ తిప్పరాజు రమేష్



**సుల్తానాబాద్,జూలై 30(జనంసాక్షి) :** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు వరద ప్రవాహంగా మారాయి.వరద ప్రవాహం ఎక్కువై ప్రజల నివాసాలలోకి వెళ్లకుండా మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ సిబ్బందిని క్షేత్రస్థాయిలో అన్ని వార్డులలో సహాయక చర్యల్లో దూకుడు పెంచారు.అన్ని వార్డుల కౌన్సిలర్లు వారి వార్డులలో సహాయక చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమై ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్నటువంటి నివాసాలు కూలిపోయే ప్రమాదం ఉండడంతో ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, కమిషనర్ తిప్పరాజు రమేష్ కౌన్సిలర్లు,గాజుల రాజమల్లు,ఉట్ల వరప్రదీప్, వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్,సిద్ద తిరుపతి,బాకం సాయికిరణ్,చింతల రాజు,గాదాసు మంజుల రవీందర్, గరిగే శోభారాణి శ్రీనివాస్,కలువల శంకరమ్మ,ఓదెలు.ఈర్ల స్వరూప శేఖర్ లు వరద సహాయక చర్యల్లో పాల్గొని నీటి ప్రవాహం లేకుండా చర్యలు చేపట్టారు.వరద ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మున్సిపల్ సిబ్బందిని అన్ని వార్డులలో ఏర్పాటు చేసి జెసిపి సహాయంతో వరద ప్రవాహాన్ని చెరువుల కుంటల వైపు తరలిస్తున్నారు. నీటి ప్రవాహం పెరిగి ఇబ్బందులు ఉంటే మున్సిపల్ చైర్మన్ తో పాటు కమిషనర్ సెల్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,కమిషనర్ తిప్పరాజు రమేష్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని,అవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు.ప్రమాదం అనిపిస్తే వెంటనే ఫోన్ చేయాలని సూచించారు.మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు.



# రామునిపల్లి సీసీ రోడ్డుకు మోక్షం ఎప్పుడు సారూ!

- సంవత్సరం గడిచిన మొదలుకాని పనులు
- ఇప్పటికైనా నిర్మాణం చేస్తారా..?
- ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన

**సుల్తానాబాద్,జూలై 30(జనంసాక్షి) :** మండలంలోని రాముని పల్లి ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగి సంవత్సరం గడుస్తున్న సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభం కాలేదని,రాముని పల్లి ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు శంకుస్థాపన చేశారని, సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అడిగితే ఇప్పుడు అప్పుడు అంటూ ఎస్సీ కాలనీ సిసి రోడ్డుపై సవతి తల్లి ప్రేమ చూపెట్టుతున్నారని, ఇప్పటికైనా సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కాలనీవాసులు కోరుతున్నారు.సిసి రోడ్డు నిర్మాణం కాకపోవడంతో పిచ్చి చెట్లు పెరిగి, తద్వారా విష పురుగులు పాములు నివాసాలలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# నిషేధిత ఫుడ్ కలర్స్, పునర్వినియోగ వంటనూనెపై ఫుడ్ సేఫ్టీ శాఖ కొరడా..

- గోదావరిఖనిలో ప్రత్యేక తనిఖీలు..
- 23కిలోల ఆహార పదార్థాలు..3 లీటర్ల వంటనూనె ధ్వంసం..
- మూడు సంస్థలకు నోటీసులు..
- పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.అంకిత్‌రెడ్డి..

**గోదావరిఖని, జనంసాక్షి:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ బుధవారం గోదావరిఖని పట్టణంలోని పలు ఆహార వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది.మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ సహకారంతో గోదావరిఖని బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలు,మార్కండేయకాలనీ పరిసరాల్లోని రెస్టారెంట్లు, స్వీట్స్ దుకాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.తనిఖీల్లో నాని మండి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీలో నిషేధిత ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు.ఫుడ్ కలర్స్ ఉపయోగించి తయారు చేసిన సుమారు 5కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకొని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.అలాగే టోటల్ పోలార్ కాంపౌండ్స్ (టీపీసీ) మీటర్‌తో పరీక్షించగా వంటనూనెను పదేపదే పునర్వినియోగం చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో సుమారు 3 లీటర్ల వంటనూనెను కూడా ధ్వంసం చేశారు.కాశ్మీర్ స్వీట్స్ అండ్ స్నాక్స్ దుకాణంలో పరిశుభ్రత లోపాలు అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.జిలేబీ,జాంగ్రీ వంటి మిఠాయిల్లో మృత ఈగలు కనిపించగా, బంగాళాదుంప చిప్స్ పాతబడిన స్థితిలో ఉన్నట్లు తేలింది.దీంతో సుమారు 7 కిలోల మిఠాయిలు, ఒక కిలో బంగాళాదుంప చిప్స్‌ను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు.

జైకా మండి రెస్టారెంట్‌లో మండి రైస్ తయారీలో ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు, అలాగే పచ్చి గుడ్లతో తయారు చేసిన మయోనైస్ నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో సుమారు 8 కిలోల మండి రైస్, 2కిలోల మయోనైస్‌ను స్వాధీనం చేసుకొని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన మూడు ఆహార వ్యాపార సంస్థలకు సంబంధిత చట్టాల ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే నిషేధిత ఫుడ్ కలర్స్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, సురక్షితమైన వంటనూనె వినియోగం, పరిశుభ్రమైన పద్ధతుల్లో మయోనైస్ తయారీ వంటి అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.అంకిత్‌రెడ్డి తెలిపారు.





# ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పెరుగుతున్న నీటి మట్టం..

## - ప్రాజెక్టుకు 16.2107 టీఎంసీల నీరు పెరిగింది..

**గోదావరిఖని, జనంసాక్షి:** రాష్ట్రంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీరు చేరుతోంది.గత కొన్ని రోజులుగా 6 నుండి 8 టీఎంసీల వరకు నీటి నిల్వ ఉండగా గురువారం 16.2107 టీఎంసీలకు చేరినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.మొత్తం ప్రాజెక్టుకు 62 గేట్లు ఉండగా, ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టిఎంసిలు.కాగా, ప్రస్తుతం 15.579 టీఎంసిల నీరు చేరిందని అధికారులు పేర్కొన్నారు.148 మీటర్లకు గాను 146.28 మీటర్ల నీరు నిల్వ ఉంది.మొత్తం ఇన్‌స్టంట్‌ఫ్లో 191275 క్యూసెక్కులుగా కొనసాగుతుంది.ప్రాజెక్టులోకి 275 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉంది. సాధారణ వర్షపాతం 66126 క్యూసెక్కులు జరుగుతుందని.హైదరాబాద్ మెట్రో వాటర్ స్కీమ్‌కు 275క్యూసెక్కులు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ప్రాజెక్టు మొత్తం 62 గేట్లకు గాను మొత్తం మూసి ఉన్నాయని, గేట్లు తెరువలేదని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.కాగా, ఎస్సారెస్పీ నుంచి ఎలాంటి నీటి చుక్క రావడంలేదు.కడెం ప్రాజెక్టులో 117307 క్యూసెక్కులు ఉందని, క్యాచ్‌మెంట్‌లో 73968 క్యూసెక్కులు వస్తున్నాయి.¯వాచ్ఎండబ్ల్యూలో 275 క్యూసెక్కుల నీరు వచ్చింది.ఎస్టీపీసీకి, వేంనూర్‌కు ఏమిలేవు, నందిమేడారంలో 15750 క్యూసెక్కుల నీరు వచ్చింది.ఆర్‌జీఎంలో జీరో క్యూసెక్కుల నీరు.కాగా, సాయంత్రం 5 గంటల వరకు 16.2107 టీఎంసీల నీరు చేరింది.రాత్రి వరకు ఇంకా నీటి ఉద్రితి పెరిగే అవకాశం ఉంది.

### ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగే అవకాశం:

కడెం గేట్లు నుంచి నీళ్లను వదిలినందున, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువన గల పరివాహక (క్యాచ్‌మెంట్) ప్రాంతాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం (ఇన్‌ఫ్లో) గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండవలసిందిగా ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా ప్రాజెక్టు దిగువన గల గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, పల్లెకారులు,ఇతరులు నది ఒడ్డుకు లేదా నదీ ప్రవాహ ప్రాంతంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

# అభివృద్ధికి ఆమడ దూరం..

## - దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని మండల కేంద్రం



**కోనరావుపేట (జనంసాక్షి):** కోనరావుపేట మండల కేంద్రంలో చినుకు పడితే చాలు రోడ్లు చెరువుల్లా మారి అధ్వాన్న పరిస్థితులు తలపిస్తున్నాయి కనీసం నడిచే పరిస్థితి కూడా ఉండదు. బురదతో కూడిన గుంతలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు మండల కేంద్రంలో సీనియర్ రాజకీయ నాయకులు ఎందరున్నా.. పార్టీలపరంగా గొప్పలు చెప్పుకోవడమే తప్ప పార్టీలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నారు. సర్పంచుల నాలుగు టర్ములు మారినా ఇప్పటివరకు అభివృద్ధి శూన్యం.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనైనా నాయకులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస చొరవతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలు కోరుకుంటున్నారు

# దశాబ్దకాలంగా తాత్కాలిక మరమ్మతులేనా?

## - శాశ్వత వంతెన నిర్మాణం ఎప్పుడూ?



**కోనరావుపేట (జనంసాక్షి):** మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని మూలవాగుపై ఉన్న వంతెన మరోసారి వర్షాలకు దెబ్బతింది. దశాబ్ద కాలంగా వర్షం వచ్చినప్పుడల్లా రహదారికొట్టుకు పోవడం, తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారనా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత వంతెన నిర్మిస్తామని అధికారులు, ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. దీంతో మండల కేంద్రానికి రాకపోకలు తీవ్రంగా ఇబ్బందిగా మారుతున్నాయని, ఎమ్మెల్యే ఇబ్బందిగా మారుతున్నాయని, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ తీసుకుని శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

# ఆగస్టు 4న జాబ్ మేళా నిర్వహణ

## - జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

పెద్దపల్లి,జూలై 30(జనంసాక్షి) : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ (హారే కృష్ణ మూమెంట్ చారిటీస్ ఫౌండేషన్ ) లో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 4 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బిజిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్‌బి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.హారే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ సంస్థలో మంథని ప్రాంతంలో పనిచేయుటకు మొత్తం 72 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఇందులో ఆపరేషన్ మేనేజర్ 1, ప్రొడక్షన్ మేనేజర్ 2, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ 5, డిస్ట్రిబ్యూషన్ ఇన్ చార్జ్ 4, డిస్ట్రిబ్యూషన్ ఎగ్జిక్యూటివ్స్ 8, మెయింటెనెన్స్ ఇన్ చార్జ్ 2, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్స్ 6, స్టోర్ ఇంచార్జ్ 3, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్ 8, క్వాలిటీ ఇంచార్జ్ 3, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్ 4, క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్ 8, కుక్స్/చెఫ్స్ 10, ఐటీ ఎగ్జిక్యూటివ్ 3, ప్రొక్యూర్‌మెంట్/పర్చేస్ 2, అకౌంట్స్ 2, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ 1 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని తెలిపారు.సంబంధిత ఉద్యోగాలకు విద్యార్హతలు పదవ తరగతి, డిగ్రీ ,డిప్లొమా, బిటెక్, ఎంటెక్ ,మెకానికల్, ఎలక్ట్రికల్ , మార్కెటింగ్ ,కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫుడ్ టెక్నాలజీ ,హోటల్ , హాస్పిటాలిటీ, ఎంబీఏ పూర్తిచేసిన వయస్సు, అనుభవం కలిగిన పురుష అభ్యర్థులు అర్హులని,ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 04 మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు అప్‌డేట్ చేసిన సివి/రెజ్యూమ్, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధృవీకరణ పత్రం తీసుకుని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులోని రూమ్ నెం. 233 జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం)కు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





# నిజామాబాద్ జిల్లాలో 11 మంది ఏ.ఎస్.ఐ లకు ఎస్. ఐ ప్రమోషన్

## వారిని అభినందించిన పోలీసు కమిషనర్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 30: జనంసాక్షి తెలంగాణ రాష్ట్ర డి.జి.పి సార్ ఆదేశానుసారముగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 11 మంది ఏ.ఎస్.ఐ లకు ఎస్.ఐ లు గా ప్రమోషన్ లభించినదని, ప్రమోషన్ పొందిన వారిని గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య అభినందించారు.గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్నటువంటి ఏ. ఎస్.ఐ లకు ఎస్.ఐ లు గా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారని, ఈ సందర్భంగా ప్రమోషన్ పొందినటువంటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు.పదోన్నతి పొందినటువంటి వారి వివరాలు బి. జాన్సన్, ఏ.ఎస్.ఐ, మహిళా పోలీస్ స్టేషన్, నిజామాబాద్,జి.రాజేశ్వర్‌రెడ్డి, ఏ.ఎస్.ఐ, వేల్పూరు పోలీస్ స్టేషన్ నిజామాబాద్, బి.అనిల్ కుమార్, ఏ.ఎస్.ఐ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్,శ్రీనివాస్ రెడ్డి, ఏ.ఎస్.ఐ,ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్, బి.సాయిలు, ఏ.ఎస్.ఐ, టౌన్ 2 పోలీస్ స్టేషన్ నిజామాబాద్, ఎం.డి.లాయక్ అలీ, ఏ.ఎస్.ఐ, టౌన్ 4 పోలీస్ స్టేషన్ నిజామాబాద్, డి.చిన్న గంగారం, ఏ.ఎస్.ఐ,టౌన్ 1 పోలీస్ స్టేషన్ నిజామాబాద్, ఎస్.కె.గఫర్, ఏ.ఎస్.ఐ, నవీపేట్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్, కె.బాబురావు, ఏ.ఎస్.ఐ,బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్, పి.శంకర్, ఏ.ఎస్.ఐ, జక్రన్ పల్లి పోలీస్ స్టేషన్ నిజామాబాద్,రేణుకా దేవి, ఏ.ఎస్.ఐ, రుద్రూర్ పోలీస్ స్టేషన్ నిజామాబాద్ లను అభినందించారు.



### బండోరుకుంట చెరువు మత్తడికి చిన్న వెంట్ ఏర్పాటు చేయాలని ఈఈకి రైతుల వినతి

'పెద్దపల్లి,జూలై 30(జనంసాక్షి) : జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామ రైతులు పెద్దపల్లి ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు గురువారం, వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఊర చెరువు (బండోరుకుంట) బ్యాక్‌వాటర్ కారణంగా ప్రతి వర్షాకాలంలో తమ వ్యవసాయ భూములు నీట మునిగి పంటలు దెబ్బతింటున్నాయని, దీంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో మత్తడి వద్ద ఒక స్లూయిస్ (వెంట్) ఉండేదని, అయితే మిషన్ కాకతీయ పనుల సమయంలో అది తొలగించబడిందో లేదా పునరుద్ధరించబడలేదో కావడంతో ప్రస్తుతం అదనపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక బ్యాక్‌వాటర్ సమస్య ఏర్పడుతోందని తెలిపారు.ప్రస్తుతం మత్తడి వద్ద చిన్న వెంట్ ఏర్పాటు చేస్తే అదనపు నీరు సులభంగా బయటకు వెళ్లి వెంకట్రావుపల్లి రైతుల భూములు రక్షించబడటంతో పాటు దిగువ ప్రాంత రైతులకు కూడా సాగునీరు అందుతుందని వివరించారు. ఈ వెంట్ ఏర్పాటు చేయాలని దిగువ ప్రాంత రైతులు కూడా కోరుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, మత్తడికి చిన్న వెంట్ ఏర్పాటు చేసి రైతులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మల్లెతుల రాజేందర్, మల్లెతుల భూమయ్య, రేచవేని అంజితో పాటు గ్రామ రైతులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు అందజేశారు.

### భారీ వర్షాలకు నేలమట్టమైన లక్ష్మీ భవాని రైస్ మిల్ రేకుల షెడ్డు

- దాదాపు 20 లక్షల ఆస్తి నష్టం. ఆదుకోవాలని రైస్ మిల్ యాజమాన్యం వినతి

సుల్తానాబాద్,జూలై 30(జనంసాక్షి) :



గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లి శివారులో గల లక్ష్మీ భవాని రైస్ మిల్ రేకుల షెడ్డు, బుధవారం ఉదయం,ధ్వంసం అయ్యాయి. రేకుల షెడ్డ ధ్వంసం దాదాపు 20 లక్షల వరకు నష్టం జరిగినట్లు రైస్ మిల్లు యజమాని తెలిపారు. అంతేకాకుండా రేకుల షెడ్డు ధ్వంసం కావడంతో వడ్లు, బియ్యం తోపాటు, బార్ దాని,ధాన్యం మొత్తం తడిసి ముద్ద అయిందని తెలిపారు.ప్రభుత్వ అధికారులు రైస్ మిల్లు నష్టం అంచనా వేసి ఆదుకోవాలని లక్ష్మీ భవాని రైస్ మిల్ యజమాని కోరారు.భారీ వర్షాల ఈదురు గాలులు,రైస్ మిల్లులకు శాపంగా మారుతున్నాయని తెలిపారు.

### బైకు దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ కే ప్రవీణ్ కుమార్..

పెద్దపల్లి,జూలై 30(జనంసాక్షి) :



పెద్దపల్లి పట్టణంలోని భరత్ నగర్ కు చెందిన మామిడిపల్లి ప్రదీప్ అను అతను ఈనెల 20న పని నిమిత్తం మంథని కి వెళ్తూ తన యొక్క బైక్ హెచ్ఎఫ్ డీలక్స్ టీఎస్ 22 డి.7969. నెంబర్ గల బైకు బస్టాండ్ దగ్గర పెద్దపల్లి ఫార్మసీ ముందు పార్కు చేసి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చేసరికి తన బైక్ కనబడకపోవడంతో ఇంత వెతికిన దొరకకపోవడంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు బైకును దొంగిలించారని గమనించి పెద్దపెల్లి టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్ ఐ కే నరేష్ . కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి బుధవారం సాయంత్రం నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ ఐ కే నరేష్ తన సిబ్బందితో చీకురాయి చౌరస్తాలో వెహికల్ చెక్ చేస్తుండగా నిందితుడిని వెలగటూర్ మండలం రాజక్ పల్లి కి చెందిన వ్యక్తి గా గుర్తించి దొంగిలించిన బైక్ తో యుక్తంగా పట్టుకోవడం జరిగిందని విలేకరుల సమావేశంలో సిఐ కే ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విచారణలో నిందితుడిపై సుమారు 9 కేసులు నట్లు తెలిపారు.నిందితుడిని గురువారం రిమాండు నిమిత్తం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడం జరిగిందని తెలిపారు. కేసును చేదించిన ఎస్సై కే నరేష్ , పిసి ప్రభాకర్, సతీష్ ను పెద్దపల్లి సిఐ కే ప్రవీణ్ కుమార్ అభినందించారు.

### చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పుష్పలత

సుల్తానాబాద్,జూలై 30(జనంసాక్షి) :



సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న చిల్డ్రన్స్ హోమ్‌ను గురువారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత సందర్శించారు.రెండు రోజుల క్రితంచిల్డ్రన్స్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు పారిపోయిన ఘటనపై అక్కడి ఇన్‌చార్జ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిపోయిన ఇద్దరు బాలికలను నల్లగొండ జిల్లాలో పోలీసులు గుర్తించి తీసుకు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చిల్డ్రన్స్ హోమ్‌లో పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యత,మెనూను పరిశీలించిన అనంతరం అంతటి పుష్పలత మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. బాలబాలికల ఆరోగ్యం, విద్య, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, వారి సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ చింతల రాజు, సిబ్బంది తదితరులున్నారు.

### పెద్దపల్లి ప్రజల చిరకాల కల బస్సు డిపో ఏర్పాటు

- దసరా వరకు ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులు పూర్తి
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

పెద్దపల్లి,జూలై 30(జనంసాక్షి) :



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ బస్సు డిపో నిర్మాణ పనులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న బస్సు డిపో పనులను తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో కలిసి పరిశీలించడం జరిగింది అని దసరా వరకు పెద్దపల్లి బస్సు డిపో ప్రారంభించే దిశగా పనులు త్వరత్వరగా జరిగేల ఎం.డి అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు తెలిపారని అన్నారు. బస్సు డిపో పెద్దపల్లి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లల్లో బస్సు డిపో ఉన్నప్పటికీ మొదటి నుండి పెద్దపల్లి కూడా రెవెన్యూ డివిజన్ అయినప్పటికీ కూడా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో డిపో లేకపోవడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష అయిన బస్సు డిపో మంజూరు చేయమని వినతి పత్రం అందజేసిన తర్వాత వారు పెద్దపల్లి ప్రజలపై ఉన్న మమకారంతో వారు 2024 డిసెంబర్ మాసంలో పెద్దపల్లి ప్రాంతానికి విచ్చేసి యువ వికాసం బహిరంగ సభలో బస్సు డిపో మంజూరు చేయడం జరిగిందని అన్నారు.పెద్దపల్లి బస్సు డిపోను దసరా వరకు పూర్తి చేస్తామని ఆర్టీసీ ఎండీ తెలిపారని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,ఆర్టీసీ ఆర్ ఎం రాజు, ఇ డి సలమాన్, డి ఎం కవిత, ఆర్ టి సి.ఎస్ ఎం కే రాంగోపాల్ రెడ్డి ఇంకా,ఆర్ టీసీ అధికారులు రామన్న, పట్టణ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సలబత్‌పూర్ చెక్‌పోస్ట్ ఘటనపై విచారణకు ఆదేశాలు..

## కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు సిఫారసు



కామారెడ్డి, జిల్లా ప్రతినిధిజూలై 30 జనం సాక్షి ) సలబత్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనపై జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వెంటనే స్పందించి ప్రాథమిక విచారణకు ఆదేశించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించిన ప్రాథమిక విచారణలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని గుర్తించి, ఆయనను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తూ నివేదిక పంపినట్లు వెల్లడించారు.

అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ద్వారా అక్రమ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు సలబత్‌పూర్ చెక్‌పోస్ట్‌ను రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. చెక్‌పోస్ట్‌లో ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు 24 గంటల పాటు విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేపడుతున్నారని చెప్పారు.

నిన్న సాయంత్రం రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ ట్రక్కులో ప్రయాణిస్తున్న యూట్యూబర్‌తో చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బందికి మధ్య జరిగిన సంభాషణ వివాదానికి దారితీసిందని, ఆ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వెంటనే ప్రాథమిక విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఘటనకు సంబంధించి విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని గుర్తించినట్లు వెల్లడించిన ముకుంద రెడ్డి, ఈ వ్యవహారంపై శాఖాపరమైన పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందన్నారు. విచారణ నివేదికను కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (నోడల్ అధికారి)కి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

అలాగే, క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని సిఫారసు చేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. శాఖ విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించదని, నిబంధనలు, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ బాధ్యులపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి స్పష్టం చేశారు.

## ఎడతెరిపి లేని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

సదాశివనగర్, జూలై30 (జనంసాక్షి): గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సదాశివనగర్ మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు కురుస్తున్న ముసురు వానలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.వర్షం కారణంగా మార్కెట్లు, వ్యాపార సంస్థలు వెలవెలబోయాయి. అత్యవసర పనులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి వెనుకాడుతున్నారు. చిరు వ్యాపారులు వ్యాపారం లేక, కూలీలు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మరోవైపు చల్లని వాతావరణం, నిరంతర ముసురుతో చిన్నారులు, వృద్ధులు వణికిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బురదమయమైన రహదారులపై రాకపోకలు కష్టంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం పూర్తిగా మేఘావృతమై ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు కొనసాగితే మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## జలసిరి పనులు వేగవంతం చేయాలి

### డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి

సదాశివనగర్, జూలై30 (జనంసాక్షి): కామారెడ్డి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీ దామోదర్ రెడ్డి గురువారం సదాశివనగర్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు నిర్మాణాల పనులను వేగవంతం చేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో ఈ పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. అలాగే గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సత్వర ఫలితాలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనం సాక్షి రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి డి.జి.పి. సి.వి.ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితులు, చేపట్టవలసిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయిలో 247 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో మోహరించి పూర్తి అప్రమత్తంగా ఉంచామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, "జీరో క్యాజువాలిటీస్" లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. డీ.జీ.పీ సీ.వీ.ఆనంద్ మాట్లాడుతూ, జిల్లా పోలీసు అధికారులు తప్పనిసరిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను అనుసరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

### మున్సిపల్ చైర్మన్ కమిషనర్



సుల్తానాబాద్,జూలై 30(జనంసాక్షి) భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ బిరుదురాధాకృష్ణ మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ మున్సిపల్ ప్రజలను కోరారు.అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వరద ఉధృతి,అతి ప్రమాదం వంటి సమస్యలు ఉంటే వెంటనే ఫోన్ ద్వారా తెలుపాలని సూచించారు.వెంటనే సహాయక చర్యలు చేపట్టుతామన్నారు.

# ప్రమాద బాధితులకు సకాలంలో సాయం చేస్తే రూ.25 వేల ప్రోత్సాహకం

## రహవీర్, పీఎం రహత్ పథకాల అమలుపై కలెక్టర్ ఆశిష్ సంగవాన్ సమీక్ష

కామారెడ్డి, జిల్లా ప్రతినిధిజూలై 30 (జనం సాక్షి) రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్ (ఖీజీప్త-ఎవవతీ)' మరియు 'పీఎం రహత్ (ఖఓ ఖీంఱు)' పథకాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ రెండు పథకాలను జిల్లాలో విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు మానవత్వంతో స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంటను"గోల్డెన్ అవర్"గా పేర్కొంటూ, ఈ సమయంలో వైద్యం అందితే అనేక మంది ప్రాణాలు రక్షించవచ్చని తెలిపారు. గోల్డెన్ అవర్‌లోపే ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తుందని వెల్లడించారు.

అలాగే పీఎం రహత్‌పథకం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ప్రతి బాధితుడికి ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏడు రోజుల పాటు గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు పూర్తిగా క్యాష్‌లెస్ వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సౌకర్యం కేవలం జాతీయ రహదారులకే కాకుండా దేశంలోని ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తిస్తుందని స్పష్టం చేశారు.

రహవీర్ పథకం కింద ప్రమాద బాధితులకు వెంటనే సహాయం చేసిన వారికి చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, పోలీసులు లేదా కోర్టుల ఇబ్బందులు ఎదురవుతాయనే భయం అవసరం లేదని తెలిపారు. ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్ఠంగా ఐదు సార్లు ఈ ప్రోత్సాహకాన్ని పొందే అవకాశం ఉందన్నారు.

ఈ రెండు పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ప్రమాదాల సమయంలో ప్రతి ఒక్కరూ బాధితులకు సహాయం చేసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ అక్రిషియేషన్ కమిటీ సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్ అధ్యక్షత వహించగా, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా రవాణా అధికారి టి. సంతోష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డా. వెంకటేశం తదితర అధికారులు పాల్గొన్నారు.



# వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**○ జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు ○అనుమతి లేకుండా అధికారులు సెలవులో వెళ్ళరాదు:జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ బ్యూరో, జూలై 30 (జనంసాక్షి) :**
రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, జిల్లాలోనూ వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పాత, శిథిలావస్థలో ఉన్న భవనాల పై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట్ల జేసీబీలు, రెస్క్యూ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లను ఏఈలతో సమన్వయం చేసుకుని నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 8782997247ను ప్రజలకు, ప్రజాప్రతినిధులకు విస్తృతంగా తెలియజేయాలి. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఈ నంబర్‌కు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

వైద్యాధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోతో సమన్వయం చేసుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. రహదారులకు జరిగిన నష్టంపై పంచాయతీరాజ్ అధికారులు వెంటనే నివేదిక అందించాలని తెలిపారు. ఆర్అండ్‌బీ రహదారులు, కల్వర్టులు, వంతెనలు ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టంపై రోడ్లు భవనాల శాఖ అధికారులు నివేదిక సమర్పించాలని అన్నారు. పంట నష్టాలను నమోదు చేయాలని, అలాగే పశుసంవర్ధక శాఖ సిబ్బందితో కలిసి అవసరమైన చోట పశువుల రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. వర్షం కారణంగా ప్రమాదకరంగా పారుతున్న నీటి కాలువల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, నీటి ప్రవాహానికి సంబంధించిన ప్రమాదకర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఎవరూ ముందస్తు అనుమతి లేకుండా




సెలవులో వెళ్ళరాదని, అందరూ తప్పనిసరిగా వారు పని చేస్తున్న హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.



## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

**నిజాంసాగర్, జూలై 23 (జనంసాక్షి):**
ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పిలుపు మేరకు గురువారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.
మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు , ప్రజా పండరి,రవీందర్ రెడ్డి అధ్యక్షతన మహాత్మా గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన ఈ నిరసనలో నాయకులు కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కాంగ్రెస్ నాయకులపై చర్యలు చేపట్టడం తగదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**భారీ వర్షాలపై హై అలర్ట్..**

## అధికారులకు సెలవులు రద్దు ?

**కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 30 (జనం సాక్షి)**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఎలాంటి సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 08468-220069 నంబర్‌తో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షాల పరిస్థితులను సమీక్షించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులను అడిగి పరిస్థితులను తెలుసుకుని, ఎక్కడా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు. వరద పరిస్థితులు ఎదురైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రోప్స్, డ్రోన్లు వంటి రక్షణ సామగ్రిని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వర్షాల అనంతరం అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని చెప్పారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం, చెరువులు, కల్వర్టులు, వాగులు, కుంటల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాముకాటు, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధుల నివారణకు అవసరమైన మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, ఎన్.వై. గిరి, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## సిరికొండ మండలాన్ని ముంచెత్తిన కుండపోత వర్షం

**36.1 శాతం అధిక వర్షపాతం నమోదు**

**- ఉధృతంగా ప్రవహిస్తున్న కప్పల వాగు - జనజీవనం అస్తవ్యస్తం, పాఠశాలలకు సెలవు ప్రకటించారు**

**సిరికొండ జూలై 30 (జనంసాక్షి ):**
నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు మండలంలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా తుంపల్లి, గడ్కోల్, రామడుగు, కొండూరు గ్రామాల మీదుగా ప్రవహించే కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.
అధికారుల వివరాల ప్రకారం, సాధారణ వర్షపాతంతో పోలిస్తే సిరికొండ మండలంలో 36.1 శాతం అధిక వర్షపాతం నమోదైంది. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే మాత్రమే బయటకు రావాలని, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

## ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం



**జనం సాక్షి, నిజాంసాగర్**
నిజాంసాగర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని సీనియర్ సీఆర్పీలు హాజరై గ్రామ సంఘాల నిర్వహణ, రుణాల మంజూరు, రుణాల వసూళ్లు, సంఘాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలు, రుణాలను సద్వినియోగం చేసుకోవడం, సకాలంలో తిరిగి చెల్లింపులు చేయడం వంటి అంశాలపై సభ్యులకు సూచనలు చేశారు. గ్రామ సంఘాల పనితీరును మరింత మెరుగుపర్చేందుకు పలు సూచనలు చేస్తూ సంఘాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏపీఎం ప్రసన్న రాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత, గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సీఐలు, సీఆర్పీలు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మెండోర గ్రామ బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా CMRF చెక్కు అందజేత

**భీంగల్ రూరల్,జులై 30(జనం సాక్షి)**
భీంగల్ మండల మెండోర గ్రామానికి చెందిన బొడిగే రూప వైద్యానికి,బాల్కొండ శాసనసభ్యులు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి CMRF చెక్కును విడుదల చేశారు. సంబంధిత చెక్కును గ్రామ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆమె భర్త బొడిగే లింబాద్రి కి అందజేశారు. ఈ సందర్భంగా బొడిగే లింబాద్రి, బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీంగల్ మండల బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు సుందరగిరి రామ్ చందర్ గౌడ్,మాజీ సర్పంచ్ ఎలిసాల రాజేందర్,సీనియర్ నాయకులు నూకల నర్సయ్య,దాసరి ముత్తేన్న, సిలివేరి ప్రదీప్, కొట్టూరి దీపక్,గ్రామ యువకులు సంగెపు మితేష్ పాల్గొన్నారు.



## మూగ చెవిటి విద్యార్థులకు అన్నదానం..

**లయన్స్ క్లబ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో..**

**ఆర్మూర్,జూలై 30(జనంసాక్షి):**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో మూగ,చెవిటి పాఠశాల విద్యార్థులకు లైన్స్ క్లబ్ మాజీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు జన్మదినంగా అన్నదానం నిర్వహించారు. సుమారు 60 మంది పైగా విద్యార్థులకు అన్నదానం అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు రఫీ గౌహర్ తెలిపారు. క్లబ్ తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుంటామని ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మూగ,చెవిటి పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ కిరీట కుమారి,శాంతమూర్తి,క్లబ్ సెక్రెటరీ అంబల తిరుపతి,ప్రోగ్రాం చైర్మన్ వెంకట్రామ రెడ్డి,కో చైర్మన్ఉ దయ్,సభ్యులు పృథ్వీరాజ్, నరసింహారెడ్డి, విజయానంద్,లోచర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ బి. సత్యప్రసాద్




**జగిత్యాల బ్యూరో జూలై 30 ( జనం సాక్షి)** జగిత్యాల జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితి పై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని తెలిపారు.తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలు తదితర అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి భోజనం, తాగునీరు, అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా బ్లాక్ కాకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు డ్రింకింగ్ వాటర్ బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశం లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజా గౌడ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్ ఐటీలో ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థిని వలస ప్రసన్న లక్ష్మికి ప్రవేశం

**కరీంనగర్ కల్చరల్, జూలై 30 ( జనం సాక్షి)** కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని వలస ప్రసన్న లక్ష్మి యోగా క్రీడాంశంలో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ కోటా కింద బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందింది. ఈ విషయాన్ని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కార్యదర్శి గుంటి రామకృష్ణ తెలిపారు.నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఉట్లపల్లికి చెందిన వలస నాగయ్య, గౌతమి దంపతుల కుమార్తె ప్రసన్న లక్ష్మి 2019లో కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో చేరింది. అప్పటి నుంచి యోగా విభాగంలో క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ జిల్లా తరపున పలు జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచింది.గత ఏడాది జాతీయ స్థాయి జూనియర్స్ విభాగం, పాఠశాలల జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న ఆమె, దేశవ్యాప్తంగా పోటీపడిన 100 మంది క్రీడాకారుల్లో ఐదో స్థానం సాధించడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీ సీటును దక్కించుకుంది.ప్రసన్న లక్ష్మి ఈ విజయంపై జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి. శ్రీనివాస్, ప్రాంతీయ క్రీడా పాఠశాల ప్రిన్సిపల్ కే. శ్రీనివాస్, యోగ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జె. మనోహర్ కుమార్, రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, కోశాధికారి పి. స్వరూప చారి, యోగా కోచ్‌లు వావిలాల కిష్టయ్య, పి. మల్లేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, కోచ్‌లు, కార్యవర్గ సభ్యులు సి.హెచ్. ప్రశాంత్, ఏ.ఆనందకిషోర్,కె. సంతోష్,పుష్పలత,జ్యోష్న, ప్రవళిక తదితరులు అభినందనలు తెలిపారు.



## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎస్పై సిరిసిల్ల అశోక్



**ఇల్లంతకుంట జూలై 30(జనంసాక్షి )** ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎడతెరిపి లేని వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాలు కురుస్తుండువల్ల ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు, కాలువలు వద్దకు ఎవరు వెళ్లవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు జారే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరికరాలను మరియు పోల్స్ కు దూరంగా ఉండాలి.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందచడానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా డయల్ 100/112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలి తెలియజేసారు.

### భారీ వర్షాల నేపథ్యంలో

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఎస్పై నరేందర్ రెడ్డి

**గన్నేరువరం, జులై 30 (జనంసాక్షి):** గన్నేరువరం మండల ప్రజలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని,అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, రైతులు పొలాల దగ్గరకి వెళ్ళినప్పుడు కరెంట్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి,భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు,వైర్లకు తాకకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని గన్నేరువరం ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు. భారీ వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,వంకలు,చెరువులు వద్ద వరద ప్రవాహం అధికంగా ఉన్న చోట వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. చిన్నారులు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి,ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదు,వర్షం సమయంలో చెట్ల కింద ఉండటం వల్ల పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల చెట్లకింద ఉండరాదు, చేపలు పట్టుటకు, పశువులను మేపడానికి బయటకి వెళ్లకూడని తెలిపారు.





## విద్యుత్ స్తంభాన్ని కమ్మేసిన తీగలు..

### ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తుల ఆందోళన..

**ముత్తారం, జూలై 30(జనంసాక్షి)** పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభంవిద్యుత్ వైర్లను అడవి తీగలు పూర్తిగా కమ్మేయడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో తీగలు వేగంగా పెరిగి విద్యుత్ స్తంభం పైభాగంతో పాటు వైర్లపై విస్తరించాయి.దీంతో గాలులు,వర్షాల సమయంలో తీగలు విద్యుత్ లైన్లకు అడ్డంకిగా మారి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా షార్ట్‌సర్క్యూట్, వైర్లు తెగిపడే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభం, విద్యుత్ వైర్లపై పెరిగిన తీగలను వెంటనే తొలగించి,అవసరమైన నిర్వహణ పనులు చేపట్టి గ్రామస్తుల భద్రతను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో ఉపాధ్యాయులదే కీలక పాత్

### లక్కారంలో ఇన్-సర్వీస్ శిక్షణ తరగతులు



**ముత్తారం, జూలై 30(జనంసాక్షి )** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత అలవాట్ల పెంపొందింపులో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని మండల వైద్యాధికారి డాక్టర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. ముత్తారం మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఇన్-సర్వీస్ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పోషకాహారం,సీజనల్ వ్యాధుల నివారణపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థుల్లో ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించి, తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ శిక్షణలో విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ,పాఠశాల ఆరోగ్య కార్యక్రమాల అమలు,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# 12వ వార్డులో డ్రైనేజీ సమస్యను తీర్చాలి

## 12వ వార్డు సభ్యురాలు ఉరుమడ్ల దీపిక..

**జనంసాక్షి రాయికల్:**
రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డులో డ్రైనేజీలో సమస్య తీవ్రతరంగా మారింది. కొన్ని సంవత్సరాల నుండి డ్రైనేజ్ సరిగా లేకపోవడంతో భారీ వర్షాలకు డ్రైనేజీలో మురికి నీరు నిండిపోయి ఇండ్లలోకి ప్రవేశించడంతో 12వ వార్డు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటారని 12వ వార్డు సభ్యురాలు ఉరుమడ్ల దీపిక తెలిపారు. వర్షాకాలం వస్తే ఆయా వార్డుల్లో కుటుంబాల పరిస్థితి అధ్వనంగా ఉందన్నారు. రాత్రి అయితే పాములు విషపూరిత జీవులు సంచరించి భయభ్రాంతులకు గురవుతున్నామని తెలియజేశారు. మొత్తం డ్రైనేజీని పూర్తి చేయకుండా సగంలోనే ఆపివేసి వార్డ్ ప్రజలకు ఇబ్బందులు తలెత్తల చేశారని తెలిపారు. అధికారులు సరైన చొరవ చూపి వార్డ్ ప్రజల ఇళ్లలోకి నీరు చేరకుండా డ్రైనేజ్ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని కోరుతున్నారు. భారీ వర్షాలు కారణంగా డ్రైనేజ్ వన్ సైడ్ సిసి రోడ్డు కింది భాగాన పూర్తిగా ధ్వంసం కావడంతో సీసీ రోడ్డు పై నుండి నిత్యం రవాణా జరుగుతున్న సందర్భంగా ఎటువంటి ప్రమాదం వాటిల్లుతుందని స్థానికులు ఆవేదనకు గురి అవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు.







# కరీంనగర్ లో ఘనంగా నూతన మైసమ్మ దేవాలయ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు

## వేడుకల్లో పాల్గొన్న మేయర్ కోలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, జూలై 30 (జనంసాక్షి) :**
కరీంనగర్ 10వ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మైసమ్మ దేవాలయ అమ్మవారి ప్రతిష్టా మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. అమ్మవారి ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ కొమరయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్టా కార్యక్రమాలను కన్నుల పండుగగా చేపట్టారు. కాలనీ ప్రజలు అందరూ కలిసికట్టుగా పండుగ వాతావరణంలో అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేయడంతో దేవాలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.
ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు. స్థానిక కాలనీవాసులందరూ ఐక్యతతో ముందుకు వచ్చి నూతన దేవాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులు కరీంనగర్ నగర ప్రజలందరి పై ఉండాలని, నగరం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక కాలనీ పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్లు

**కరీంనగర్ బ్యూరో, జూలై 30 (జనంసాక్షి) :**
కరీంనగర్ లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం రోజు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లు నగరంలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ రోడ్డులో గల ప్రధాన మురుగు నీటి వరద కాలువను తనిఖీ చేసి పరిశీలించి కలెక్టరేట్ రోడ్డు పై వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ లోకి ప్రవహించేలా చర్యలు చేపట్టారు. స్థానికంగా ఉండి అధికార సిబ్బంది తో ఫుట్ పాత్ వీప్ హోల్స్ ను తెరిపించారు. నగరపాలక సంస్థ అధికార, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం లో డీఈలు లచ్చిరెడ్డి, డిజాస్టర్ సిబ్బంది పాల్గొన్నారు.



### మంత్రిగారు గిరి ప్రదక్షిణ కాదు

# దేవాలయ అభివృద్ధికి దిశ చూపండి

## జనసేన నాయకుడు రాజ్‌కుమార్

**మల్యాల జూలై 30 (జనం సాక్షి):** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామిని గురువారం కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ డా. బండారి రాజ్‌కుమార్ దర్శించుకున్నారు. తెలంగాణ ప్రజలందరూ బాగుండాలని, ఆంధ్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని,స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని ప్రార్థించానని తెలిపారు. డా. బండారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గురు పౌర్ణమి రోజు గిరి ప్రదర్శన చేసి స్వామివారిని దర్శించుకోవడం స్వాగతించదగిన విషయమే.అయితే లక్షలాది మంది భక్తులు ఆశించింది గిరిప్రదక్షిణ వార్తలు కాదు కొండగట్టు అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం. పార్కింగ్,భక్తుల కాటేజీలు,తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,రహదారులు,పరిశు భ్రత,భక్తుల వసతులు వంటి ప్రధాన సమస్యల పరిష్కారంపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటిస్తారని అందరూ ఎదురుచూశారని కానీ ఆ అంశాలపై చర్చ జరగకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది అని అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ ని పేడ్ ఆర్టిస్ట్ అని సంబోధించడం రాజకీయ హుందాతనానికి తగినది కాదు,విమర్శలతో రాజకీయాలు చేయడం సులభం,కానీ కొండగట్టు వంటి మహా పుణ్యక్షేత్రాన్ని దేశంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక?పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే విజన్ చూపించడం నిజమైన నాయకత్వం ప్రజలు రాజకీయ వ్యాఖ్యలను కాదు అభివృద్ధి ఫలితాలను గుర్తుంచుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నాయకురాలు డా.సాయి కృష్ణ ప్రియ,జనసేన నాయకురాలు రాజిత, చొప్పదండి జనసేన నాయకులు మొగిలిపాక రమేష్, శ్రీనాథ్‌తో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు,ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.



# బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి నరేంద్ర కుమార్ మృతి

## గుండెపోటుతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో తుదిశ్వాస

నిజాంసాగర్, **(జనం సాక్షి)**
నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేంద్ర కుమార్ గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల క్రితం ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో స్వగ్రామమైన కామారెడ్డి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.గత మూడు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్న నరేంద్ర కుమార్ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.నరేంద్ర కుమార్ మృతి వార్త తెలిసిన సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# భారీ వర్షాలకు కూలిన ఇల్లు : పరామర్శించిన ఎమ్మెల్యే సత్యం

**మల్యాల జూలై 30 (జనం సాక్షి)**
భారీ వర్షాల కారణంగా తాటిపల్లి గ్రామానికి చెందిన గంగాధర గంగవ్వ ఇల్లు కూలిపోయింది.స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 10 వేలు రూ ఆర్థిక సాయం అందజేశారు.ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెటపెల్లి లత, ఉపసర్పంచ్ లక్ష్మనచారి,ఆనంద రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్,సర్పంచ్ లు దారం ఆది రెడ్డి,చెవుల మద్ది శ్రీనివాస్,నాయకులు ముత్యాల నరసింహారెడ్డి నేరెళ్ల సతీష్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.



## కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా వి. సత్యవర్ధన్‌రావుకు అదనపు బాధ్యతలు

**కరీంనగర్ టౌన్, జూలై 30, ( జనంసాక్షి)**

కరీంనగర్ జిల్లా ఫుల్ అడిషనల్ ఛార్జ్ (ఈంఅ) జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (ఆఎఇూ)గా ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్), కరీంనగర్ ప్రిన్సిపాల్ వి. సత్యవర్ధన్‌రావును నియమిస్తూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ అభిలాష అభినవ్ (ఐఏఎస్) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఎఫ్ఏసీ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న వి. అంజనేయరావు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ నియామకం చేపట్టారు. ఉత్తర్వుల ప్రకారం, ఆగస్టు 1 నుంచి తదుపరి ఆదేశాలు వెలువడే వరకు వి. సత్యవర్ధన్‌రావు తన ప్రస్తుత విధులతో పాటు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బాధ్యతలను కూడా నిర్వహించనున్నారు.

## వర్షాలకు ఇండ్లు కూలిన బాధితులకు తక్షణ సహాయాన్ని అందించాలి

### బాధితులకు ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్



**గంగాధర జూలై 30(జనంసాక్షి):**

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని నారాయణపూర్ గ్రామంలో జెడ రాజయ్య మరియు సుంకె లచ్చయ్యల ఇండ్లు కూలిపోవడంతో విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ గ్రామానికి వెళ్ళి వారిని పరామర్శించి బాధితులకు రెండువేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు వర్షాలకు ఇండ్లు కూలిన బాధితులకు ప్రభుత్వం నుండి తక్షణ సహాయం కింద నష్టపరిహారం అందించాలని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గ్రామంలో మరో మూడు ఇండ్లు శిథిలావస్థలో ఉన్నాయి వారిని పునరావాస కేంద్రాలకు చేర్చాలని గంగాధర తహసీల్దార్ మరియు ఎంపిడిఓలకు పోన్ చేసి కోరారు. గ్రామంలో వర్షాల వల్ల చలికి అనారోగ్యంతో బాధపడుతున్న ఎండి బషీర్ ను పరామర్శించి అతనికి రెండువేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ ఎండి నజీర్ హుస్సేన్, మాజీ ఎఎంసి డైరెక్టర్ గర్వందుల పరశు రాములు, బిఆర్ఎస్ నాయకులు సుంకే శంకరయ్య, బావండ్ల రాములు, ఎండి ఫారుక్, మరియు గ్రామస్తులు ఉన్నారు.

## నిజాంసాగర్ ఏఈగా సేన సంజయ్ బాధ్యతల స్వీకరణ

**నిజాంసాగర్, జూలై 20 (జనం సాక్షి):**

ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పెర్కిట్ సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించి పదోన్నతి పొందిన సేన సంజయ్ సోమవారం నిజాంసాగర్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ శాఖ సిబ్బంది వినియోగదారులకు ఎల్లప్పుడూ నాణ్యమైన సేవలు అందిస్తూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పనిచేసి నిజాంసాగర్ సెక్షన్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఐ మజర్ అలీ, ఎల్ఐ నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, ఎల్ఎం షేర్ అలీ, ఎల్ఎం నాగరాజు, ఎల్ఎం కట్టకూరితో పాటు పలువురు ఏఎల్ఎంలు మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొని నూతన ఏఈ సేన సంజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.




## బోధన్ లో 27మి.మీల వర్షపాతం నమోదు

**లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన బోధన్ మండల తహసీల్దార్ విఠల్**

**బోధన్, జూలై 30 ( జనంసాక్షి ) :**

బోధన్ మండలంలోని లోతట్టు ప్రాంతాలను గురువారం బోధన్ మండల తహసీల్దార్ విఠల్ పరిశీలించారు. ఈ మేరకు భారీ వర్షాలు పడుతున్న తరుణంలో మండలంలోని పెగడాపల్లి, హంగర్గ గ్రామాలను సందర్శించి గ్రామాలలో కూలిపోయిన ఇండ్లను, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధన్ మండలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువనున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరముంటేనే ఇంటి నుండి బయటకు రావాలని, పాత ఇండ్లలో నివసించేవారు వెంటనే ఖాళీ చేసి గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంకు వెళ్లాలని స్పష్టం చేశారు. మంజీరా పరివాహ ప్రాంత ప్రజలు పై నుండి



వచ్చే భారీ ఫ్లోతో గ్రామాల వరకు నీరు వచ్చే ప్రమాదం ఉందని అందువల్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అంతేకాకుండా పుకార్లను నమ్మకుండా ప్రభుత్వ అధికారులు చెప్పే సందేశాలను మాత్రమే నమ్మాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని తహసీల్దార్ విఠల్ కోరారు. ఈ కార్యక్రమంలో పెగడాపల్లి సర్పంచ్ మద్ది రచన సుదర్శన్, ఉప సర్పంచ్ షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి నాగార్జున గౌడ్, హంగర్గ సర్పంచ్ ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి షేక్ జహీర్ తదితరులు ఉన్నారు.



## భారీ వర్షాలకు రహదారిపై విరిగిపడిన చెట్లు

**మల్యాల జూలై 30 (జనంసాక్షి)**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జగిత్యాల కరీంనగర్ ప్రధాన రహదారి కొండగట్టు శివారు మెహర్ బాబా టెంపుల్ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం రోడ్డుపై వెళ్తున్న రెండు వాహనాలపై పడడంతో ఒకరికి గాయాలు పోలీసులు జేసీబీ సహాయంతో తొలగిస్తూ ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూశారు. రాజారంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ముందర కూడా మరో చెట్టు నేలకూలడంతో పోలీసులు వెంటనే స్పందించి దానిని తొలగించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**చొప్పదండి, జూలై 30 (జనంసాక్షి ):**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేష్ రెడ్డి సూచించారు. భారీ వర్షం, ఉరుములు ఉన్నప్పుడు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల దగ్గర నిలబడవద్దని, రోడ్లపై నీరు నిలిచిన చోట్ల, కాల్వల్లోకి దిగవద్ద- కరెంట్ స్తంభాలు మరియు ఇతర ఇనుప స్తంభాలు ముట్టుకో వద్దని, వాటి ద్వారా కరెంట్ షాక్ ప్రమాదం ఉండవచ్చుని, బలహీనమైన ఇళ్లు, గోడలు, హోర్డింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనం నడిపే అప్పుడు హెడ్లైట్ వాడుతూ నెమ్మదిగా వెళ్లాలని ,వరద నీరు ఉన్న రోడ్ల మీదుగా వెళ్ళవద్దని, వాతావరణ హెచ్చరికలు, ప్రభుత్వ సూచనలను టీవీ/రేడియో/మొబైల్ ద్వారా తెలుసుకుంటూ ఉండాలని ప్రమాదం జరిగితే వెంటనే 100, 108, లేదా స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## గ్రామపంచాయతీ విరుద్ధంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలపై చర్యలేవి?

### చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు.. ప్రజల్లో అసంతృప్తి

గంభీరావుపేట, జూలై 29 (జనం సాక్షి):

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అనుమతుల నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు కొనసాగుతున్నా, అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి స్లాబ్ అనుమతులకు మించి రహదారి వైపు ముందుకు వచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే మార్గంలో ప్రతి ఏడాది శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా రామాలయం నుంచి గరుడసేవ పురవీధుల గుండా తొమ్మిది రోజులపాటు నిర్వహించబడుతుండటంతో



భక్తులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు ఇచ్చినా సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపట్టారని, గ్రామపంచాయతీ మరియు సంబంధిత శాఖల నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమ నిర్మాణాల కారణంగా రహదారులు ఇరుకుగా మారడం, డ్రైనేజీ వ్యవస్థలకు అంతరాయం కలగడం, ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు అవకాశం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై నోటీసులు జారీ చేసి, అవసరమైతే నిర్మాణాలను నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఈఓ వినీల్ రెడ్డి వివరణ:**

ఈ అంశం తన దృష్టికి వచ్చిందని గ్రామపంచాయతీ ఈఓ వినీల్ రెడ్డి తెలిపారు. సంబంధిత ఇంటి స్లాబ్ అనుమతుల కంటే ముందుకు వచ్చిన విషయం వాస్తవమేనని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భాగాన్ని తొలగించే చర్యలు చేపడతామని చెప్పారు. అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఇల్లంతకుంటలో ఏమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు తహసీల్దార్ సురేష్

ఇల్లంతకుంట జులై 30(జనంసాక్షి )



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారివర్షాల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు ఇల్లంతకుంట మండల తహసీల్దార్ కార్యాలయంలో అత్యవసర నియంత్రణ గది ఏమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు రాచకట్ల సురేష్ తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు వరద ముప్పు రాకపోకలు ఇబ్బందులు లేదా ఇతర సమస్యలు ఎదురైనా ప్రజలు వెంటనే మండల కంట్రోల్ రూమ్ సంప్రదించాలని అయన సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయము చేసుకొని తక్షణ చర్యలు చెప్పడతామని తెలిపారు. వర్షాల సమయాల్లో అనవసరంగా బయటకు వెళ్లకుండా అధికారులు జారీ చేస్తున్న సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి కొరారు. అత్యవసర సహాయం కోసం సంప్రదించా లించిన హెల్ప్ లైన్ ఇల్లంతకుంట మండల కంట్రోల్ రూమ్ 9963782919ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండ అవసరంమైన సహాయం కోసం ఈ నెంబర్కు సంప్రదించాలని తహసీల్దార్ సురేష్ విజ్ఞప్తి చేసారు.

## బోధన్ లో సీనియర్ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోషేషన్ సమావేశం



బోధన్, జూలై 30 ( జనంసాక్షి ) :
బోధన్ పట్టణంలో సీనియర్ ఫోటో, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడియో పాస్ పోర్టు సైజు రేట్లను( పెరిగిన పేపర్ మరియు కలర్ ధరలను దృష్టిలో ఉంచుకొని ) పెంచుతున్నట్లుగా ప్రకటించారు. పెంచిన రేట్లు ప్రకారం పాస్ పోర్టు సైజు ఫోటోలు ( 8 ) కాపీలకు 100 రూపాయలుగా (16) కాపీలకు 150 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే మొబైల్ ఫోటోలకు 50 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని, ఈ నిర్ణయాన్ని గౌరవిస్తూ వినియోదారులు, ప్రజలు సహకరించాలని అసోసి యేషన్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మురళి కటి కల, ఉపాధ్యక్షులు శంకు గణేష్, కార్యదర్శి సోముల అనిల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎర్ర శ్రీకాంత్, క్యాషియర్ ఉమాకాంత్, మాధవ్, గౌరవ అధ్యక్షులు అనీల్ గౌడ్, అశోక్, పాండు, ప్రభాకర్త దితరులు పాలుగోన్నారు.

## బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారును కలిసిన ప్రైవేటు పాఠశాల, కళాశాలల ప్రతినిధులు

బోధన్, జూలై 30 ( జనంసాక్షి ) :
బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని గురువారం బోధన పట్టణంలోని ప్రైవేటు పాఠశాల కళాశాలల యాజమాన్య ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రైవేటు పాఠశాల, కళాశాల సంఘం అధ్యక్షులు కొడాలి కిషోర్, చక్రవర్తి, సూర్య ప్రకాశ్ రావ్, జయప్రకాష్, హరి, రాజు, శ్రీనివాస్ రావ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై శ్రీకాంత్

### వాగులు, చెరువులు, ప్రమాదకర ప్రాంతాల వద్దకు వెళ్లొద్దని సూచన

గంభీరావుపేట, జూలై 30 (జనం సాక్షి );



మండలంలో కురుస్తున్న అకాల వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ సూచించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు, చెరువుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అవసరం లేకుండా వాటి వద్దకు వెళ్లవద్దని కోరారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, విద్యార్థులు బురద రహదారులు, నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని తెలిపారు. నీటి ప్రవాహాన్ని అంచనా వేసి వాగులు దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకున్నా లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు.

## పేరపల్లి లో వర్షాలకు కూలిన ఇంటి గోడ

కమాన్ పూర్, జూలై 30, (జనంసాక్షి) :




పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల పరిధిలోని పేరపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సంధ్యారాణి ఇంటి గోడ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బొంగోని సదయ్య, జిపిఓ అశోక్, పంచాయతీ సిబ్బందితో కలిసి కూలిపోయిన ఇల్లును పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థకు చేరిన పాత గోడలు, ఇళ్ల వద్ద ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## ప్రభుత్వ ఆస్పత్రి రహదారి దుస్థితిపై నిరసన.. స్మార్ట్ సిటీ నిధుల వినియోగంపై ప్రశ్నలు

కరీంనగర్ టౌన్, జూలై 30, ( జనంసాక్షి)
కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ముందు రహదారి దుస్థితిని నిరసిస్తూ కోట శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రహదారి అధ్వానంగా ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. రహదారి మరమ్మతులను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ నిధుల వినియోగంపై కోట శ్యామ్ కుమార్ ప్రశ్నలు లేవనెత్తారు. నగర అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదని, స్మార్ట్ సిటీ నిధులు ఎలా వినియోగించబడ్డాయో వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక కార్యకర్త అన్నమల్ల సురేష్ కూడా స్మార్ట్ సిటీ నిధుల వినియోగంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ముందు రహదారిని తక్షణమే అభివృద్ధి చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని వారు కోరారు.

## వర్షానికి ఇల్లు కూలింది

ముస్తాబాద్ జులై 30 (జనం సాక్షి)



ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లే గ్రామంలో ఎండి లాల్ బి పెంకుటిల్లు కూలినట్లు తాసిల్దార్ ఫారుక్ ఇల్లును పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికను అధికారులకు సమాచారం అందించి కూలిపోయిన ఇల్లుకు ఆర్థిక సాయం అందించే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈయన వెంట గ్రామ సర్పంచ్, మెంగని శీను, కారోబర్ రాజు, ఉన్నారు.

# లేట్ అయిన.. లేటెస్ట్ గా..!

◆వరుణుడి కరుణతో.. ఎట్టకేలకు చెరువులు, కుంటలకు జలకళ

◆పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకుతున్న గుండారం రిజర్వాయర్



మంథని, జులై 30, (జనంసాక్షి ) :
ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో వరి సాగు దాదాపు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో.. ఆలస్యంగానైనా వరుణుడు కరుణించి గత మూడు రోజులుగా విస్తారంగా ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండడంతో మంథని ప్రాంతంలోనే కాకుండా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు జల కళను సంతరించుకున్నాయి. పెద్దపల్లి జిల్లాలో 1021 చెరువులు ఉండగా ఇందులో 80 శాతం కు పైగా చెరువులు పూర్తిస్థాయిలో నుండి మత్తడి దూకుతున్నాయి. మరో ఒకటి, రెండు రోజుల్లో 100 శాతం చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నీటితో నిండనున్నాయి. అలాగే పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నుండి మత్తడి ద్వారా నీటి ప్రవాహం పరవళ్ళు తొక్కుతూ బొక్కల వాగులో కలుస్తున్నది. ఈ గుండారం రిజర్వాయర్ నుంచి రిజర్వాయర్ క్రింద ఉన్న వందలాది ఎకరాల ఆయకట్టుతో పాటు రామగిరి, ముత్తారం, మంథని మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందనుంది. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు, వాగులు వంకలు వర్షపు నీటితో జలకళ ను సంతరించుకోవడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



## అనంతారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం..

ఇల్లంతకుంట జూలై 30(జనం సాక్షి)
గ్రామాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేయడం అభినందనీయం. ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో కాత్యాయని కంటి హాస్పిటల్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 150 మంది ప్రజలు కంటి పరీక్షలు చేసుకోగా అవసరమైన వారికీ మందులు, కంటి అద్దాలు హాస్పిటల్ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటేష్ రజిత మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు హాస్పిటల్ బృందం ఉచిత వైద్య సేవలు అభినందనీయమని, వారికి గ్రామ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాత్యాయని హాస్పిటల్ వైద్యులు సింగ్, లతతో పాటు శ్రీనివాస్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### రుద్రంగి ఎస్సై మోతిరామ్

రుద్రంగి జూలై 30 ( జనంసాక్షి)

రుద్రంగి మండల కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రుద్రంగి ఎస్సై మోతిరామ్ విజ్ఞప్తి చేశారు.వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కల్వర్టులను దాటేందుకు ఎవరూ సాహసించవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల వల్ల రోడ్లు, వంతెనలు జలమయమయ్యే ప్రమాదం ఉందని, ఆకస్మిక వరదల వల్ల ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు.గ్రామీణ ప్రజలు తమ గొర్రెలు, మేకలు, పశువులను మేత కోసం వాగుల వద్దకు లేదా చెరువుల్లోని లోతట్టు ప్రాంతాలకు తీసుకువెళ్లవద్దని కోరారు.ముఖ్యంగా చిన్న పిల్లలను, వృద్ధులను వరద నీటికి దూరంగా ఉంచాలని, ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కొమ్మెరకు పితృవియోగం

గన్నేరువరం, జూలై 30 (జనంసాక్షి):

గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొమ్మెర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి తండ్రి కొమ్మెర ధర్మారెడ్డి గురువారం పరమపదించారు. ధర్మారెడ్డి అంత్యక్రియలకు అశేష జనవాహిని తరలివచ్చింది. ధర్మారెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ గ్రామానికి చేరుకుని ధర్మారెడ్డి పార్థివ దేహానికి అంతిమ నివాళులర్పించారు. అనంతరం, ఆయన కుమారుడు కొమ్మెర రవీందర్ రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ అంతిమయాత్రలో మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి,గన్నేరువరం, మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొడ్డు సునీల్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, అలువాల కోటి, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, ముక్కస రత్నాకర్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి సంపత్ గౌడ్,రామిడి తిరుమల్ రెడ్డి,బండి మల్లేశం,సీహెచ్ శ్రీధర్,అనంత్ రెడ్డి, ఎం.శ్రీనివాస్, సీహెచ్ నరసింహ రెడ్డి, మల్లేశం, సంపత్ రెడ్డి, దేవయ్య, అంజిరెడ్డి,రెవెల్లి రాజలింగం,ఎనగంటి శ్రీకాంత్,నల్ల సూర్య ప్రకాష్,ఏ.శ్రీకాంత్ తోపాటు పార్టీ జిల్లా, మండల, రాష్ట్ర నాయకులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు, సింగిల్ విండో అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్మారెడ్డికి ఘనంగా తుది వీడ్కోలు పలికారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు

మెట్ పల్లి,జూలై 30(జనం సాక్షి)

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రాకూడదని ప్రమాదాలకు గురి కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని టీపీసీసీ డెలిగేట్ మెంబర్ కల్వకుంట్ల సుజీత్ రావు కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు.భారీ వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారని, అందువల్ల ప్రజలు భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే జాగ్రత్తగా ఉండాలని,పట్టణంతో పాటు పలు మండలాలు, గ్రామాల ప్రజలు వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్ట్, రహదారులపై నుండి దాటవద్దని, శిథిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్, ట్రాన్స్ఫర్స్ తాకవద్దని, శివారు ప్రాంతాల్లో చేపల వేటకు ఎవరు వెళ్ళొద్దని సూచించారు. అదే విధంగా రైతులు కరెంటు బావుల దగ్గరికి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వరద నీరు వెళ్లే నాలాలు, మ్యాన్ హోల్స్ సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడే ప్రమాదాలు గతంలో చూశామని, కావున ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వర్షాలు, వరదల వల్ల సహాయక చర్యలు చేపట్టేందుకు స్థానిక అధికారులు సిద్ధంగా ఉన్నారని, కానీ అన్నిటి కన్నా ముఖ్యంగా ఎవరికివారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరమైతే, ఏదైనా సంఘటన జరిగితే స్థానిక అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు పొందాలని కోరారు ప్రభుత్వం సంబంధిత కార్యాలయాలలో అధికారులను అప్రమత్తం చేసిందని ఏదైనా అత్యవసరం అయితే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

## ఆగస్టు 1లోగా సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజ్ కన్ఫర్మేషన్ పూర్తి చేసుకోవాలి

### ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ

కరీంనగర్ టౌన్, జూలై 30, ( జనం సాక్షి)

దోస్త్?2026 స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆగస్టు 1వ తేదీలోగా ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌తో పాటు కాలేజ్ కన్ఫర్మేషన్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్), కరీంనగర్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ సూచించారు.డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు తమ దోస్త్ వ్యక్తిగత లాగిన్ ద్వారా ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని తెలిపారు. అలాగే జూలై 31 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఒరిజినల్ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్, ఇతర అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో కళాశాలకు హాజరై సిసి ఓటిపి సమర్పించి కాలేజ్ కన్ఫర్మేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు.నిర్దేశించిన గడువులోగా కాలేజ్ కన్ఫర్మేషన్ పూర్తి చేయని విద్యార్థులకు కేటాయించిన సీట్లు రద్దు అయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అందువల్ల స్పెషల్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులందరూ గడువు ముగిసేలోపు సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజ్ కన్ఫర్మేషన్ ప్రక్రియలను పూర్తి చేసి తమ ప్రవేశాన్ని ఖరారు చేసుకోవాలని ప్రొఫెసర్ కె. రామకృష్ణ కోరారు.



## ధర్మపురి బీజేపీ ఆధ్వర్యంలో గురూ పౌర్ణమి సందర్భంగా గురూవులకు సన్మానం

ధర్మపురి జగిత్యాల జిల్లా జూలై 29 (జనంసాక్షి) :
భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ ధార్మిక సెల్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అన్నవాజ్జుల సూర్యప్రకాష్, ఆదేశాల మేరకు గురు పౌర్ణమి సందర్భంగా ధర్మపురి గురువులకి అల్లువాల దత్తాత్రేయ గురువు కి , నాటక సంస్కృతి కళా రంగంలో కోరిద నరహరి శర్మ కి ఈరోజు గురు పౌర్ణమి సందర్భంగా చిన్న బహుమతి తో, శాలువాతో సత్కరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బిజెపి ఎండోమెంట్ ధార్మిక సెల్ జగిత్యాల్ జిల్లా కో కన్వీనర్ కలకోట రాజేష్, టౌన్ మహిళా కన్వీనర్ ముత్యపు రాధిక, మర్యాల అనూష, టౌన్ కన్వీనర్ కొత్తపెల్లి కిషన్, కో కన్వీనర్ దివిటీ.శ్రీకాంత్ బిజెపి టౌన్ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ. బీజేవైఎం సూరజ్ .శివ సాయి ముత్యపు.రమేష్ మర్యాల సందీప్.తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షాలకు గంభీరావుపేట లింగన్నపేట మట్టి రోడ్డు ప్రమాదకరం..

### బురదమయంగా మారిన రహదారి.. రాకపోకలకు తీవ్ర అంతరాయం

గంభీరావుపేట, జూలై 30 జనం సాక్షి:
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోగత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల ప్రభావంతో గంభీరావుపేట-లింగన్నపేట మధ్య ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి ప్రమాదకరంగా మారింది. రహదారిపై భారీగా నీరు నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనదారులు, పొలాల దగ్గరికి వెళ్లే రైతులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొన్ని చోట్ల రోడ్డు కోతకు గురికావడంతో వాహనాలు ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం ఉన్నచోట నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి, రాకపోకలకు అనువుగా మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పలు గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో చిరంజీవి తహసిల్దార్ నాగర్జున

రాయికల్ జనం సాక్షి :
రాయికల్ మండలంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు భారీ వర్షాల నేపథ్యంలో ఎంపీడీవో చిరంజీవి మరియు తహసిల్దార్ నాగార్జునమండలంలోని పలు గ్రామపంచాయతీలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు మరియు జీపిఓ లను అప్రమత్తం చేస్తూ ఈ క్రింది చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.వరద నీరు ప్రవహిస్తున్న వంతెనలు, కల్వర్టుల వద్ద స్టాపర్లు/బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలు మరియు వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపి వేయాలి. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన వసతి మరియు ఇతర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. చెరువులు, కుంటలు నిండిన నేపథ్యంలో చేపలు పట్టేందుకు లేదా సందర్శన కోసం ఎవరూ వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలి మరియు ప్రజలకు అవగాహన కల్పించాలి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే తక్షణమే డీ-వాటరింగ్ చర్యలు చేపట్టి నీటిని తొలగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్స్ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, జిపిఓలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 30:( జనం సాక్షి )**ఇందూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధానంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పరచాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులతో పాటు సంబంధిత విభాగాధిపతులు సిబ్బందితో సమాచారం తెలుసుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు. నాలాలు సరిగా లేనిచోట ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. గత అను భవాలను దృష్టిలో పెట్టుకొని ఎలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అధిక వర్షపాతం నమోదైనప్పుడు నాలాలు వెంటనే శుభ్రం చేయాలన్నారు. నీరు నిండిన చోట తోడేందుకు భారీ మోటార్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అవసరమైతే ప్రత్యేక బృందాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు.

## వర్షాల నేపథ్యంలో

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 30 : (జనంసాక్షి)**ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ భుజంగరావు తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో నెలకొని ఉన్న పరిస్థితులను కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని అన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్:08462-220183కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# భూగర్భ జలాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**కమ్మర్పల్లి జులై 30(జనంసాక్షి)** భూగర్భ జలాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా స్వీకరించాలని హాశ కొత్తూరు గ్రామ సర్పంచ్ నలిమేల రేవతి గంగారెడ్డి సూచించారు. గురువారం రోజున జలసిరి కార్యక్రమం సందర్భంగా గ్రామ సభ నిర్వహించి కార్యక్రమంలో సంర్పచ్ గంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతలు సోక్ పిట్స్,లేదా మ్యాజిక్ సోక్ పీట్స్ నిర్మించుకోవాలి. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి వర్షపు నీటిని ఒడిచిపట్టేందుకు ఊట గుంటలు,కమ్యూనిటీ ఊట గుంటలు నిర్మించుకోవాలని అన్నారు. భూగర్భ జలాల పెంపుదలకు బోర్ల వద్ద రీఛార్జ్ స్ట్రక్చర్లు ఏర్పాటు చేయడం ఎంత అవసరమని ఈ చర్యల వల్ల భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించవచ్చున ని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపు నీరు భూమిలోనికి ఇంకి భూగర్భ జలాలు మొత్తం పెరుగుతుందని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి ఇంటిలో నాలుగు రకాల చెత్త డబ్బులను ఉపయోగించి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లో వేయాలిని కోరారు. తద్వారా పరి సరాలు పరిశు భ్రంగా ఉండడంతో దోమలు ,ఈగలు ,దుర్వాసన లేకుండా పరిశుభ్రంగా మారు తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్ వార్డ్ సభ్యులు కాశవ్వ,జమున, అశోక్,మాజీ సర్పంచ్ చిటికేసి గంగాధర్,ఏఎన్ఎం మమత,వివోఏలు వీణ,సాగరిక ఆశా వర్కర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి



**సదాశివనగర్, జూలై30 (జనంసాక్షి):** సదాశివనగర్ మండలంలో వీబీజీ రామ్‌జీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని, అలాగే ప్రతి నెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ.. విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ నెలల తరబడి వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వేతనాల చెల్లింపులో జాప్యం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు అప్పుల పాలవుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రతి నెల నిర్ణీత సమయంలో వేతనాలు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాలోత్ దేవిసింగ్, రఘునాథరావు, పొన్న నర్సింలు, క్యామ పుష్పాంజలి, ఎం. నరస గౌడ్, రఘుపతి రెడ్డి తదితర ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ఒక్క వానకే కుంగిన రూ.53 లక్షల కొండూరు బ్రిడ్జి మరమ్మతులు



**సిరికొండ, జూలై 30 (జనం సాక్షి):** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండూరు గ్రామ సమీపంలోని వాగు బ్రిడ్జిని బీజేపీ నాయకుడు దినేష్ కులాచారి గురువారం పరిశీలించారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈ బ్రిడ్జి దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నెలలో సుమారు రూ.53 లక్షల వ్యయంతో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టింది. అయితే ఇటీవల కురిసిన వర్షానికే మరమ్మతులు చేసిన భాగం కుంగిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని దినేష్ కులాచారి అన్నారు.ప్రజాధనంతో చేపట్టిన పనులు ఇంత తక్కువ సమయంలోనే దెబ్బతినడం పనుల నాణ్యతపై అనేక సందేహాలకు తావిస్తోందని ఆయన విమర్శించారు. . ప్రస్తుతం పెద్ద వాల్గొట్, చిన్నవాల్గొట్ మీదుగా వాహనాలు, ఆర్టీసీ బస్సులు సిరికొండ చేరుకుంటున్నప్పటికీ ఆ రోడ్డు పరిస్థితి కూడా బాగాలేదని, ప్రయాణానికి అనుకూలంగా వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన కోరారు.గత సంవత్సరం వర్షాలకు ఇండ్లు కూలిపోయిన వారికి ఇప్పటివరకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదని, వారికి వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభ దశలోనే ఈ పరిస్థితి ఏర్పడితే, రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసినప్పుడు కొండూరు బ్రిడ్జి పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ మార్గం ద్వారా సిరికొండ మండలంలోని పలు గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, అత్యవసర సేవల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, బ్రిడ్జి దెబ్బతింటే మండల కేంద్రంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని దినేష్ కులాచారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దినేష్ కులాచారి వెంట జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, కర్క గంగారెడ్డి, మండల అధ్యక్షులు సంజీవ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, తలకట్ల గంగారెడ్డి, ప్రేమ్ మరియు ఇతర యువ నాయకులు పాల్గొన్నారు.

# పొంగిపొర్లుతున్న వాగు రాకపోకలు అంతరాయం



**గాంధారి జూలై 30(జనం సాక్షి)** గాంధారి మండలంలోని చిన్న పొతంగల్ వద్ద వాగు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు వాగు ఉధృతంగా పొంగిపొర్లుతుంది. దీంతో చిన్న పొతంగల్ నుండి పెద్ద పోతంగల్ కు వెళ్లే దారి పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. ముఖ్యంగా విద్యార్థులు అప్పర్ ప్రైమరీ విద్య అభ్యసించడానికి వాగు దాటి పెద్ద పోతంగల్ లోని జడ్పిహెచ్ఎస్ నందు విద్యను అభ్యసిస్తున్నారు అయితే వర్షాల కారణంగా వాగు ఉదృతంగా ప్రవహించడంతో విద్యార్థుల చదువుకునేందుకు వెళ్లే దారి నీటితో పొంగిపొర్లడంతో స్కూల్ కు వెళ్లే పరిస్థితి లేదు

# ఎల్నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ నీటి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి



**నిజాంసాగర్ జూలై 30(జనంసాక్షి)**ఈ వానాకాలంలో ఎల్నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సాగర్ సూచించారు.మండలంలోని మాగి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, పెసర, మినుము, కంది, నువ్వులు, వేరుశెనగ, పొద్దుతిరుగుడు వంటి తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎల్నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాగి గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

# లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం




**కమ్మర్పల్లి జులై 30(జనంసాక్షి)** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పీఎంజేఎఫ్ లయన్ అన్న బంధు బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం రోజున లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి అధ్యక్షుడు తెడ్డు రమేష్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అన్న బందు బాబురావు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సమాజంలో నిరుపేదలు అవసరమైన వారికి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన వారి సేవా స్ఫూర్తిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ ముఖాగంగాధర్ ప్రధాన కార్యదర్శి లయన్ ఎండి కోశాధికారి లయన్ సుంకరి విజయ్ , గోపి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ముస్తాబాద్ జూలై 30(జనంసాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జ్యోతి విజ్ఞప్తి చేశారు.వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయ టకు రావద్దని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కల్వర్టులను దాటేందుకు ఎవరూ సాహసించవద్దని హెచ్చరించారు. భారీ వర్షాల వల్ల రోడ్లు, వంతెనలు జలమయమయ్యే ప్రమాదం ఉందని, ఆకస్మిక వరదల వల్ల ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు.గ్రామీణ ప్రజలు తమ గొర్రెలు, మేకలు, పశువులను మేత కోసం వాగుల వద్దకు లేదా చెరువుల్లోని లోతట్టు ప్రాంతాలకు తీసుకువెళ్లవద్దని కోరారు.ముఖ్యంగా చిన్న పిల్లలను, వృద్ధులను వరద నీటికి దూరంగా ఉంచాలని, ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కూలిపోయిన ఇండ్లను పరిశీలించిన



**బోధన్, జూలై 30 ( జనంసాక్షి )**బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో గత మూడు రోజుల నుండి కురస్తున భారీ వర్షాలకు గ్రామంలో కూలిపోయిన ఇండ్లను, రోడ్లు డ్రైనేజీల వ్యవస్థను గురువారం సర్పంచ్ పోరెడ్డి గంగాధర్, వార్డు మెంబర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ వర్షాలకు పాత ఇండ్లలో నివసించే ప్రజలు వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రం కు వెళ్లాలని సూచించారు. వర్షపాతం అధికంగా నమోదు కావడం వల్ల పాత ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉందని అందువలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లు డ్రైనేజీలలో సైతం నీరు అధికంగా ప్రవహిస్తున్నందున అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుండి బయటకు రావాలని ఆయన అన్నారు. మంచినీటి సైతం శుభ్రంగా ఉంచుకోవాలని వేడి నీటిని తాగడం వల్ల ఎలాంటి రోగాలు దరిచేరే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. భారీ వర్షాల వల్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ పోరెడ్డి గంగాధర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి రంజిత్, వార్డు మెంబర్లు కూనింటి రాజు, నర్రా సుధాకర్, సమీరుద్దిన్, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్ర పల్లన్న, జీపీవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కానుకలను లెక్కించిన ఆలయ అధికారులు,భక్తులు



**చిగురుమామిడి జులై30 (జనంసాక్షి):**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సుందరగిరి శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయ హుండీ కానుకల లెక్కింపును గురువారం ఆలయ అధికారులు నిర్వహించారు.గత 10నెలలుగా భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను ఆలయ అధికారులు,అర్చకులు,సిబ్బంది సమక్షంలో లెక్కించారు.ఈ లెక్కింపులో స్వామి వారికి మొత్తం రూ.1,92,184.00 (ఒక లక్షా తొంభై రెండు వేల నూట ఎనభై నాలుగు రూపాయలు) నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కొండపర్తి రాజ్ కుమార్ తెలిపారు.భక్తులు తమ మొక్కుబడుల రూపంలో నగదుతో పాటు పలు రకాల కానుకలను హుండీలో సమర్పించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సహాయ కమిషనర్ శ్రీనివాస్,ఆలయ అర్చకులు శేషం నవీన్ ఆచార్యులు,హుస్నాబాద్ శ్రీ గోమాత సేవాసమితి సభ్యులు,కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై యువత అప్రమత్తంగా ఉండాలి




కామారెడ్డి, జిల్లా ప్రతినిధిజూలై 30 (జనం సాక్షి)మానవ అక్రమ రవాణా వంటి సామాజిక దురాచారాలను అరికట్టడంలో యువత కీలక పాత్ర పోషించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఐ. ప్రసన్న అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖి కేంద్రం సంయుక్తంగా మిషన్ శక్తి పథకం కింద గురువారం కామారెడ్డి పట్టణంలోని ఆర్కే డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ. ప్రసన్న మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని పేర్కొన్నారు. అక్రమ రవాణా జరిగే విధానాలు, దానికి దారితీసే కారణాలు, యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు.మాదకద్రవ్యాల వినియోగం, సెల్‌ఫోన్ వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై కూడా అవగాహన కల్పిస్తూ, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు.జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ తరఫున పాల్గొన్న న్యాయవాది కె. సిద్ధిరాములు విద్యార్థులకు న్యాయపరమైన హక్కులు, మౌలిక హక్కులు, మహిళలు, పిల్లల రక్షణకు సంబంధించిన చట్టాలపై వివరించారు. అనంతరం కళాజాత బృందం పాటలు, ప్రదర్శనల ద్వారా మానవ అక్రమ రవాణా నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళల భద్రత వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యపరిచింది.ఈ కార్యక్రమంలో ఆర్కే డిగ్రీ కళాశాల సీఈవో జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్, అమృత దత్తహరి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


## భారీ వర్షాల కారణంగా ప్రజలను అప్రమత్తం చేయాలి



**ఆర్మూర్,జూలై30(జనంసాక్షి):** ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాలలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని ఎంపీడీవో బలే శివాజీ తెలిపారు. చెరువులు నుండి రోడ్ల వరకు చేరిన ప్రాంతాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు.శిథిలావస్థలో ఉన్న పూరి గుడిసెలు,కూనా పెంకుల ఇండ్లు,స్లాబ్ ఇల్లు ఉన్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలుగా పాఠశాలలు,గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సంఘం భవనాలు,కమ్యూనిటీ భవనాలు వాడుకోవాలని తెలిపారు.పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలకు వంట సామాను, నిత్యాసర వస్తువులను అందే విధంగా రెవెన్యూ సిబ్బందితో సమన్వయం చేయాలని తెలిపారు. చేపల వేటకు నదులు, కాలువలు ,చెరువులకు వెళ్లకుండా చూడాలని వాగులు వంకలు వరద ప్రాంతాలలో సెల్ఫీలు రీల్ కొరకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు ఏర్పాటు తీసుకోవాలన్నారు.లోతట్టు కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద వరద తాకిడి ఎక్కువగా ఉంటుందని,వాగులు వంతెనలు దాటకూడదన్నారు..పెద్ద పెద్ద చెట్ల వద్ద హై టెన్షన్ వైర్ల వద్ద వాహనదారులు గాని,ప్రజలు కానీ ఉండకూడదని మెరుపులు,ఉరుములు ఉన్నప్పుడు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో బయటకు రాకూడదని తెలిపారు.ఇంట్లో విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.పంచాయతీ కార్యదర్శులు రోడ్ల పైన తెగిపడిన చెట్లను వెంటనే తొలగించి రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలని,ప్రతి గ్రామంలో మైక్ ల ద్వారా టామ్ టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వర్షాల మూలంగా ముఖ్యంగా మానవ నష్టాన్ని తగ్గించాలని ఆదేశించారు. చెరువులు,తూములు అలుగులు, బుంగలపట్ల నీటి పారుదల శాఖ అధికారులు జాగ్రత్తగా ఉండి అవసరమైన చోట ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. వర్షాలు భారీగా కుడుస్తున్నందున వనమహోత్సవం కార్యక్రమం వేగవంతం చేయాలని ప్రతి గ్రామం వారి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

## భిక్కనూరులో స్నేహ పాఠశాలలో ఘనంగా గ్రీన్ డే వేడుకలు

భిక్కనూరు జూలై 30 (జనం సాక్షి):
భిక్కనూరు మండల కేంద్రంలో గల స్నేహ పాఠశాల లో గురువారం గ్రీన్‌డే వేడుకలలో విద్యార్థులు, చిన్నారులు ఉత్సాహంగా ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి,ప్రకృతిని ప్రతిబింబించే వినూత్న వేషధారణల తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు, ప్రతి విద్యార్థి తన సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ప్రకృతిపై ప్రేమను చాటుకున్నారు, ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ ఎండి,సలీం మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు చెట్లను నాటి వాటిని రక్షించాలని సూచించారు,విఈక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, జ్ఞాన ప్రసూన, నవ్య విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పెద్ద చెరువును పరిశీలించిన సర్పంచ్



**మల్లాపూర్,జూలై30(జనంసాక్షి) :** మండల కేంద్రము లో పెద్ద చెరువు వద్ద నీటి ప్రవాహాన్ని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ మరిఆయు పాలక వర్గం ఆధ్వర్యంలో పరిశీలించారు. గతం లో చెరువు కు గండి పడిన స్థలాన్ని పరిశీలించారు. మత్సకారులు భారీ వర్షాలు ముగిసే వరకు చేపల వేటకు చెరువు లోకి వెళ్లొద్దు, గ్రామస్తులు కూడా అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దు అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి, వార్డు సభ్యులు ముష్కరి రమేష్,భుక్యా శేఖర్, మహమ్మద్ షబ్బీర్, ముత్యాల గంగా రాజం, అల్లె చంద్రయ్య, శనిగారపు నరేష్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు

## మినీ గురుకులంను సందర్శించిన పాలక వర్గం



**మల్లాపూర్,జులై 30(జనంసాక్షి)** మేజర్ గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో మల్లాపూర్ లోని మినీ గురుకులం పాఠశాల ను గురు వారం ఆకస్మిక తనిఖీ చేశారు.పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని సూచించారు, పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు.సదుపాయాల పట్ల సర్పంచ్ సంతృప్తి వ్యక్తం చేసారు.ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రియాంక, సిబ్బంది సుమ లత, సునీత, శ్రీలత, సులోచన విద్యుత్, డైనింగ్ హాల్ సమస్యలు పాలకవర్గం కు వివరించారు.ఈ సందర్శన లో ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి,వార్డు సభ్యులు ముష్కరి రమేష్,భూక్యా శేఖర్, అల్లె చంద్రయ్య, ముత్యాల గంగా రాజం,మహమ్మద్ షబ్బీర్, శనిగారపు నరేష్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

